ఆంధ్రజ్యోతి

5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు


శనివారం 3 ఫిబ్రవరి 2024



సోమశిలలో తగ్గుతున్న నీటి నిల్వ



అనంతసాగరం : సోమశిల జలాశయంలో నీటి నిల్వ తగ్గుతోంది. ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. గురువారం 25.439 టీఎంసీల నీరు ఉండగా, శుక్రవారానికి 25.173 టీఎంసీలకు చేరింది. ఇక దిగువ డెల్టాకు 2,250, ఉత్తరకాలువకు 500, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



పలేటివారిపాలెం ఎగుమతికి సిద్ధంగా...

'ఎవరేం అనుకున్నా మాకేం. అధికారం మాది. ఏం చేసినా చెల్లుబాటు అవుతుంది. ఎన్నికల 'కోడ్' రాకముందే అన్ని సర్దేద్దాం.' అన్నధోరణిలో అక్రమార్కులు బరితెగిస్తున్నారు. ప్రకృతి వనరులైన తెల్లరాయి (క్వార్ట్జ్), గ్రావెల్‌ను భారీ యంత్రాలతో ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. ఆ తర్వాత గుట్టుచప్పుడు కాకుండా జిల్లా సరిహద్దు దాటించి సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా జరుగుతున్న ఈ వ్యవహారంపై తెలిసినా అధికార యంత్రాంగం మొద్దునిద్ర వీడటం లేదు. కరిగిపోతున్న ప్రకృతి సంపదను చూసి కడుపు మండిన స్థానికులు నిలదీస్తే అక్రమార్కులు దౌర్జన్యాలకు దిగుతున్నారు.

ఏ బిడ్డా.. మా అడ్డా!



పలేటివారిపాలెం, ఫిబ్రవరి 2 : మండలంలో తెల్లరాయి దొంగలు రెచ్చిపోతున్నారు. అటవీ, రెవెన్యూ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు జరుపుతూ రూ.కోట్లు గడిస్తున్నారు. అయినా అటవీ, రెవెన్యూ, మైనింగ్ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడంలేదు. దీంతో తెల్లరాయి (క్వార్ట్జ్) వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు గా సాగుతోంది. అయ్యవారిపల్లె, మాలకొండ, చుండి, పోలినేని చెరువు, రామలింగాపురం, గరుకపాలెం, అంకభూపాల పురం గ్రామాల్లోని అటవీ, రెవెన్యూ భూముల్లో తెల్లరాయి నిక్షేపాలు అధికంగా ఉన్నాయి. ఆయా ప్రాంతాలపై కన్నేసిన అక్రమార్కులు రాత్రింబవళ్లు విచ్చలవిడిగా ఎక్స్‌కవేటర్లతో తవ్వి తెల్లరాయిని వెలికి తీస్తున్నారు. ఈ గ్రామాల్లో లభ్యమవుతున్న తెల్లరాయి నాణ్యతలో నెంబర్‌వన్‌గా ఉండడంతో విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ఈ తెల్లరాయి పొడి వివిధ వస్తువుల తయారీ, మందుల ఉత్పత్తిలోనూ ఉపయోగపడుతుంది. దీంతో అక్రమార్కులు దాన్ని ఎగుమతి చేసి అనతికాలంలోనే రూ.కోట్లు గడిస్తున్నారు.

- బరితెగిస్తున్న మైనింగ్ మాఫియా
- రెవెన్యూ అటవీ భూముల్లో అక్రమ తవ్వకాలు
- భూమి పొరల్లో నుంచి తెల్లరాయి వెలికితీత
- ఆపై గట్టుచప్పుడు కాకుండా తరలింపు
- రూ. కోట్లు గడిస్తున్న అక్రమార్కులు
- మొద్దు నిద్ర వీడని అధికార యంత్రాంగం
- నిలదీసిన స్థానికులపై దౌర్జన్యం

● ఖజానాకు గండి

ప్రకృతి సంపద అయిన తెల్లరాయిని తవ్వుకోవాలంటే ముందుగా మైనింగ్ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత తహసీల్దార్ వద్ద ఎన్‌వోసీ తీసుకోవాలి. మైనింగ్ అధికారుల నుంచి అనుమతి వచ్చాక క్వారీ పనులు చేపట్టాలి. భూమి నుంచి వెలికి తీసిన తెల్లరాయికి టన్నేజీ ప్రకారం విలువ కట్టి ప్రభుత్వానికి రుసుం చెల్లించాలి. కానీ ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమంగా తెల్లరాయి తవ్వకాలు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు గండి పడుతోంది.

● జోరుగా అక్రమ తవ్వకాలు

రెవెన్యూ, అటవీ భూముల్లో జోరుగా తెల్లరాయి అక్రమ తవ్వకాలు చేస్తున్నారు. యంత్రాల ద్వారా తెల్లరాయిని వెలికితీసి, కూలీల ద్వారా రాయిని సైజులుగా కొట్టిస్తున్నారు. దాన్ని రాత్రిళ్లు గుట్టుచప్పుడు కాకుండా లారీలకు లోడ్ చేయించి చెన్నైకి తరలిస్తున్నారు. అక్కడ నుంచి వ్యాపారులు విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడడంలేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తెల్లరాయి అక్రమ తవ్వకాలపై చర్యలు చేపట్టాలి.



పలేటివారిపాలెం : అయ్యవారిపల్లెలో తెల్లరాయి కోసం తవ్వకాలు జరుపుతున్న వాహనం

మాఫియా దెబ్బకు కరిగిపోతున్న 'తిప్ప'



సంగం : గ్రావెల్ తరలింపుతో తిరుమనతిప్పలో ఏర్పడిన గుంతలు

సంగం : మండలంలోని తిరుమనతిప్పలో గ్రావెల్ అక్రమ తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. కొందరు అక్రమార్కులు ఎక్స్‌కవేటర్లతో తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వార ప్రైవేట్ లే అవుట్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో 252 సర్వే నెంబరులో ఉన్న తిరుమనతిప్పలో విలువైన గ్రావెల్ ఉంది. ఎక్కడ గ్రావెల్ అవసరమైనా మాఫియా కళ్లు ఈ తిప్పపై పడిపోతున్నాయి. రాత్రి పొద్దుపోయిన తరువాత ఎక్స్‌కవేటర్లతో తవ్వి ట్రాక్టర్ల లోడ్ దూరాన్ని బట్టి రూ.1500 నుంచి 2000లకు విక్రయిస్తున్నారు. అనుమతులు లేకుండా అక్రమార్కులు బరితెగిస్తున్నా రెవెన్యూ యంత్రాంగం కబోదిలా వ్యవహరిస్తోంది. పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడు హడావుడి చేస్తున్న అధికారులు ఆ తర్వాత మిన్నకుండిపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం తిరుమనతిప్పలో నిఘా పెట్టి గ్రావెల్ తరలింపును అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అనుమతుల పేరుతో బరితెగింపు

మర్రిపాడు : అనుమతుల పేరుతో మండలంలో అక్రమార్కులు బరితెగిస్తున్నారు. శెట్టిసముద్రం గ్రామ చివర పొలాలు, చిలకపాడు రెవెన్యూలో భూముల్లో సుమారు 20అడుగుల లోతున బండరాళ్లను భారీ ఎక్స్‌కవేటర్లతో వెలికి తీస్తున్నారు. వీటిని గట్టుచప్పుడు కాకుండా సరిహద్దులు దాటించేస్తున్నారు. మూడు రోజులుగా ఈ వ్యవహారం సాగుతుండటంతో స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేయగా, తమకు అనుమతులు ఉన్నాయంటూ బుకాయిస్తున్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో తెల్లరాయి తవ్వకాలు తగ్గటంతో సరిహద్దు మండలమైన మర్రిపాడులో అక్రమార్కులు చొరబడ్డారు. చూస్తుండగానే ఒకేచోట 12ఎకరాల భూమిలోని రాయిని తవ్వుకునేందుకు శ్రీకారం చుట్టారు. గతంలో కూడా మండలం నుంచే తెల్లరాయిని తవ్వి చెన్నైకు తరలించి, సొమ్ము చేసుకున్నారు. ప్రస్తుతం టన్ను మన దగ్గర రూ.15వేలు ఉండగా విదేశాల్లో 40వేల నుండి 50 వేల వరకు పలుకుతోంది. దీంతో అక్రమార్కులు బరితెగించి తవ్వకాలు జరుపుతున్నారు.



మర్రిపాడు : భూమిలో తెల్లరాయిని వెలికి తీస్తున్న ఎక్స్‌కవేటర్

అక్రమ మైనింగ్ మళ్లీ మొదలు

పొదలకూరు : వరదాపురం గ్రామంలోని రుస్తుం, భారత్ క్వారీలలో మొన్నటిదాకా ఆగిన అక్రమ మైనింగ్‌ను అక్రమార్కులు పునఃప్రారంభించారు. రోజుకు ఐదు లారీల సరుకును అక్రమంగా తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం. వారం రోజులుగా తెల్లరాయి యథేచ్ఛగా తరలిపోతున్నా అధికార యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి. టీడీపీ నేత సోమిరెడ్డి సత్యాగ్రహ దీక్షతో కొన్ని రోజులపాటు అక్రమ మైనింగ్‌ను ఆపేశారు. అయితే, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కోడ్ రాకముందే అక్రమ సొమ్మును గడించేందుకు అధికార పార్టీ నాయకులు ఏ అవకాశాన్ని వదులుకోవడం లేదని, అందులోభాగంగానే రుస్తుం మైకా మైన్‌లో మైనింగ్ కొనసాగిస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు విమర్శించారు.



పొదలకూరు: మైన్‌లో క్వార్ట్జ్ లోడ్‌తో ఉన్న లారీ



ఆదిదంపతులకు పుష్పాభిషేకం

జొన్నవాడలో మల్లికార్జున, కామాక్షితాయి స్వామి అమ్మవార్లకు శుక్రవారం పుష్పయాగం వేడుకగా జరిగింది. నెల్లూరు, హైదరాబాదు, చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాలకు చెందిన దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలోని అలంకార మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. అంతకముందు పల్లవ గ్రానైట్స్ అధినేత దాత కొడవలూరు సుబ్బారెడ్డి సహకారంతో నిర్మించిన నిత్యాన్నదాన భవనం, మరో దాతల సహకారంతో నిర్మించిన వాటర్ ట్యాంకును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం వారిని ఆలయ మర్యాదలతో చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, ఈఓ గిరికృష్ణ, అర్చకులు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. బుచ్చి చైర్‌పర్సన్ సుప్రజ, ఆలయ కమిటీ సభ్యులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఓ భజన బృందం నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది.

\- బుచ్చిరెడ్డిపాళెం

వైసీపీ సిటీ సమన్వయకర్తగా ఖలీల్

నెల్లూరు ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నగర నియోజకవర్గంపై వారం రోజులుగా కొనసాగు తున్న ఉత్కంఠకు తెరపడింది. ప్రస్తుత ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్‌ను నరసరావుపేట పార్ల మెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించిన తర్వాత సిటీపై అందరి దృష్టి పడింది. ఈయన స్థానంలో నగర ఇన్‌చార్జిగా ఎవరిని నియమిస్తా రన్నది ఆసక్తిగా మారింది. ఈ క్రమంలో అనేక పేర్లు తెరమీదకు వచ్చాయి. అయితే శుక్రవారం రాత్రి వైసీపీ అధిష్ఠానం విడుదల చేసిన జాబితాలో నెల్లూరు సిటీ సమ న్వయకర్తగా డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్‌ను నియమించారు. ఆయన అనిల్ వర్గానికి చెందిన వ్యక్తి. సిటీ ఇన్‌చార్జిగా పలువురు పేర్లు ప్రచారానికి వచ్చిన నేపథ్యంలో అనిల్ వర్గంలో ఆందోళన మొదలయింది. దీంతో ప్రస్తుతానికి వారందరి ఆందోళనలను తొలగించేందుకు ఖలీల్ అహ్మద్‌ను సమన్వయ కర్తగా నియమించినట్లు వైసీపీ వర్గాల ద్వారా తెలుస్తోంది.

మార్చి 3న పల్స్‌పోలియో

నెల్లూరు (వైద్యం) : మార్చి నెల 3వ తేదీన జరిగే పల్స్‌పోలియో కార్యక్రమానికి అంతా సిద్ధంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య వెల్లడించారు. శుక్రవారం నెల్లూరులోని తన కార్యాలయంలో నెల్లూరు, కావలి, కందుకూరు డివిజన్ల ఆరోగ్య పర్యవేక్షకులకు సర్వేలెన్స్ వర్కుషాపు జరిగింది. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పల్స్‌పోలియోలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి 100 శాతం లక్ష్యాలను సాధించాలని తెలిపారు. అదనపు జిల్లా వైద్యాధికారి ఖాదర్‌వలి మాట్లాడుతూ క్షయ రహిత సమాజం మనందరి ధ్యేయమన్న విషయం మరిచి పోవద్దని సూచించారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ సెలీనాకుమారి, సర్వేలెన్స్ వైద్య అధికారి డాక్టర్ మోనికా తదితరులు పాల్గొన్నారు.



కలువాయిలో చెన్నయ్య కుటుంబ సభ్యులకు చెక్కు ఇస్తున్న భువనేశ్వరి, పక్కన కురుగొండ్ల

కష్టాలు వింటూ.. కన్నీళ్లు తుడుస్తూ..

అధైర్య పడొద్దు.. ధైర్యంగా ఉండాలని భువనేశ్వరి భరోసా

బాధిత కుటుంబాలకు అండగా టీడీపీ

జిల్లాలో ముగిసిన 'నిజం గెలవాలి' యాత్ర

పెద్దదిక్కును కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబసభ్యులను ఓదార్చుతూ వారి కష్టాలు వింటూ కన్నీళ్లు తుడుస్తూ 'అధైర్య పడొద్దు.. మేమున్నాం. అంటూ నారా భువనేశ్వరి భరోసానిచ్చారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా జిల్లా పర్యటనలో మూడవ రోజు శుక్రవారం ఆత్మకూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లో ఆమె పర్యటించారు. అడుగడుగునా భువనేశ్వరికి టీడీపీ నాయకులు, కార్యకర్తలతోపాటు సమీప ప్రజలు ఘన స్వాగతం పలికారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక చనిపోయిన కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పడంతో పాటు ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

7వ పేజీలో

మాటలు తప్ప... ఇళ్లేవి?

నెల్లూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : అంతన్నారు.. ఇంతన్నారు. అదిగో స్థలం అంటే... ఇవిగో ఇళ్లు అంటూ గొప్పలు చెప్పుకున్నారు. నాలుగేళ్లు గడిచిపోయాయి. కానీ పేదవాడికి మాత్రం సొంతింటి కల నెరవేర లేదు. ఎంతో ఆర్భాటంగా ప్రారం భమైన పేదలందరికీ ఇళ్లు పథకం అభాసుపాలవుతోంది. జిల్లాలో లబ్ధిదారు లకు మంజూరైన ఇళ్లకు, పూర్తయిన ఇళ్ల సంఖ్య కు అస్సలు పొంతన కనిపించడం లేదు. రూ.వంద ల కోట్లు ఖర్చు చేసినా కనీసం ఇరవై శాతం ఇళ్లను కూడా పూర్తి చేయలేకపోయారు. ఆది నుంచీ సరైన ప్రణా ళిక లేకపోవడం, ఇళ్లు నిర్మించుకునేందుకు వీలులేని ప్రదేశా ల్లో లేఅవుట్లు వేయడం, కొన్ని లేఅవుట్లలో నిర్మాణాలు చేసినా కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వక పోవడం.. ఇలా అనేక లోపాలు పేదలందరికీ ఇళ్లు పథకం విఫలమవడానికి కారణమని అధికార వర్గాలే చెప్పుకుంటున్నాయి. జిల్లాలో 95,963 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయగా నాలుగేళ్ల క్రితం ఈ నిర్మాణాలు మొదలుపెట్టారు. ఇప్పటికి 16,849 ఇళ్లు మాత్రమే పూర్తవగా, 15,474 ఇళ్లు అసలు మొదలే పెట్టలేదు. మరో 28,188 ఇళ్లు బేస్ లెవల్ కన్నా దిగువన ఉండగా మరో 19,567 ఇళ్లు బేస్ స్థాయిలోనే ఉన్నాయి. ఇక 5,426 ఇళ్లు రూఫ్ లెవల్, 10,459 ఇళ్లు రూఫ్ కాంక్రీట్ స్థాయిలో ఉన్నాయి. గడిచిన నాలుగు నెలలుగా చూసుకుంటే పేదల ఇళ్ల నిర్మాణాల్లో మరీ నిర్లక్ష్యం కనిపిస్తోంది. గత అక్టోబరు ప్రారంభం నాటికి 15,504 ఇళ్లు పూర్తి చేశారు. అంటే ఈ నాలుగు నెలల వ్యవధిలో 1,345 ఇళ్లను మాత్రమే పూర్తి చేయగలిగారు. ఈ లెక్కన జిల్లాలోని అర్హులైన పేదలందరికీ ఎప్పటికి ఇళ్లు నిర్మిస్తారో అధికారులే సమాధానం చెప్పాలి.

- ఫలితమివ్వని అందరికీ ఇళ్లు పథకం
- పేదలకు నెరవేరని సొంతింటి కల
- 95,963 ఇళ్లు మంజూరు.. 16,849 మాత్రమే పూర్తి
- లేఅవుట్లలో సాగని నిర్మాణాలు

సమీక్షించేవారేరి..?

నాలుగేళ్ల క్రితం అర్హులకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు. అప్పుడే అందరికీ పట్టాలు కూడా అందజేశారు. అయితే చాలా చోట్ల ఊర్లకు దూరంగా, శ్మశానాలకు దగ్గరగా లేఅవుట్లు వేయడంతో అక్కడ ఇళ్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. కొన్ని చోట్ల ఇళ్లు నిర్మించుకునేందుకు అవకాశమున్నప్పటికీ ప్రభుత్వమే నిర్మించి ఇచ్చేలా ఆప్షన్-3ని లబ్ధిదారు లు ఎంచుకున్నారు. దీంతో దాదాపు వంద మంది కాంట్రాక్టర్లకు జిల్లాలో ఇళ్ల నిర్మాణాలను అప్పగించారు. అయితే చాలా చోట్ల ఇళ్లను నాసిరకంగా నిర్మిస్తున్నారు. మరికొన్ని చోట్ల బేస్‌మెంట్ స్థాయిలోనే ఆపేశారు. ఈ ఇళ్లను పూర్తి చేసి పేదలకు అందించాల్సిన ప్రభుత్వం ఆ దిశగా దృష్టిసారించడం లేదన్న విమర్శలున్నాయి. ఆరు నెలల ముందు వరకు అటు రాష్ట్ర ఉన్నతాధికారులు, ఇటు జిల్లా ఉన్నతాధికారులు ప్రతి రోజూ ఇళ్ల నిర్మాణాల పురోగతిని సమీక్షించే వారు. కానీ ఇప్పుడు ఎవరూ పట్టించుకో వడం లేదు. ఇళ్ల నిర్మాణాలను వదిలేసి గతంలో ఇచ్చిన పట్టాలకు ఇప్పుడు రిజిస్ట్రేషన్ అంటూ హడావిడి చేస్తుండడంపైనా లబ్ధిదారుల నుంచి అసహనం వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకు నిర్మించిన 16,849 ఇళ్లలో సగం వరకు సొంత స్థలాల్లో నిర్మించుకున్నవే ఉన్నాయి. దీనిని బట్టి లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు ఎలా జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.



నెల్లూరు నగర సమీపంలోని కొండ్లపూడి వద్ద జగనన్న కాలనీ

కష్టాలు వింటూ.. కన్నీళ్లు తుడుస్తూ..

- అధైర్య పడొద్దు.. ధైర్యంగా ఉండాలని భువనేశ్వరి భరోసా
- బాధిత కుటుంబాలకు అండగా టీడీపీ
- జిల్లాలో ముగిసిన 'నిజం గెలవాలి' యాత్ర

ఆత్మకూరు/ కలువాయి/ రాపూరు (డక్కిలి), ఫిబ్రవరి 2 : 'అధైర్య పడొద్దు.. మీకు అండగా పార్టీ ఉంటుంది.' అంటూ మృతుల కుటుంబ సభ్యులకు టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి భరోసా ఇచ్చారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆత్మకూరు, కలువాయి, రాపూరు మండలాల్లో ఆమె పర్యటించారు. ఉదయం నెల్లూరు నుంచి బయలుదేరిన భువనేశ్వరి ఆత్మకూరు పట్టణం లోని అల్లీపురంలో మృతుడు కముజుల ఆంజనేయరెడ్డి కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించి, చెక్కు అందజేశారు. అనంతరం కలువాయి లోని సుసర్లవీధికి చెందిన బొలిగర్ల చెన్నయ్య, శానాయపాలెంలో సన్నిబోయిన కృష్ణయ్యల కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే, రాపూరు మండలం తాతిపల్లి గ్రామంలో సన్నుబోయిన కృష్ణయ్య కుటుంబాన్ని కూడా నారా భువనేశ్వరి పరామర్శించారు. కృష్ణయ్య భార్య సుబ్బరత్నమ్మ, కుమార్తె కవితలు భావోద్వేగానికి గురై దిక్కులేని సమయంలో టీడీపీ ఇన్‌చార్జి కురుగొండ్ల రామకృష్ణ, నాయకుడు తిక్కమనేని ప్రసాద్ నాయుడులు తమ కుటుంబానికి అండగా నిలిచారని తెలిపారు. అమరవీరులైన కార్యకర్తలకు నివాళులర్పించారు. ఆయా కుటుంబాల స్థితిగతులు తెలుసుకున్నారు. భువనేశ్వరిని చూడగానే మృతుల కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు. వీరందరికీ భవిష్యత్‌లోనూ పార్టీ అండగా ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. కాగా, టీడీపీ నాయకులు, కార్యకర్తలతోపాటు అభిమానులు మహిళలు తరలివచ్చి భువనేశ్వరి ఘన స్వాగతం పలికారు. ఆమెను చూసి సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. భువనేశ్వరి వెంట వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, వెంకటగిరి ఇన్‌చార్జి కురుగొండ్ల రామకృష్ణ, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు పాశం సునీల్, కొమ్మి లక్ష్మయ్యనాయుడు, తిరుపతి పార్లమెంటు ఇన్‌చార్జి నరసింహ యాదవ్, నేతలు మస్తాన్ యాదవ్, దావా పెంచలరావు, పులిమి శైలజారెడ్డి, బుల్లెట్ రమణ, తుమ్మల చంద్రారెడ్డి, సుంకర పెంచలచౌదరి, చిట్టమూరి వెంకటేశ్వర్లురెడ్డి, చెరుకూరు పద్మావతమ్మ, కురుగొండ్ల సింధు, నాయకులు రావి నాయుడు, తిరుపతి ఇన్‌చార్జి సుగుణమ్మ, పునుగోటి విశ్వనాధ నాయుడు, కేవీకే ప్రసాద్ నాయుడు, కృష్ణా యాదవ్, చక్రాల ఉష, జెన్ని రమణయ్య, డాక్టర్ చంద్రహస్, అల్లంపాటి సంధ్య, గోను గుంట వెంకటేశ్వర్లు తదితర నేతలు ఉన్నారు. అనంతరం భువనేశ్వరి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని హైదరాబాద్‌కు పయనమయ్యారు.


ఆత్మకూరు : ఆంజనేయరెడ్డి కుటుంబసభ్యులకు చెక్కు ఇస్తున్న భువనేశ్వరి


రాపూరు : తాతిపల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి చెక్కు అందజేస్తున్న భువనేశ్వరి

● పిల్లలూ.. బాగా చదవండి

రాపూరు (డక్కిలి) : కలువాయి నుంచి రాపూరు వెళుతున్న భువనేశ్వరిని ఆకర్షించేందుకు పెనుబర్తి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శ్రమించి పూలతో నిజం గెలవాలి లోగోను తీర్చిదిద్దారు. టీడీపీ నాయకుడు ఖాజా సహకారంతో ఏర్పాటు చేసిన ఈ లోగోను భువనేశ్వరి పరిశీలించి, పిల్లలను అభినందించారు. బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలని సూచించారు.

సోమశిలలో జాలర్ల మధ్య చిచ్చు

- మళ్లీ తెరపైకి అలివి వలల వివాదం
- ఆందోళన చెందుతున్న స్థానికులు
- లోతట్టులో తనిఖీలు కరువు

అనంతసాగరం, ఫిబ్రవరి 2: సోమశిల జలాశయంలో నిషేధిత అలివి వలల వేట జాలర్ల మధ్య చిచ్చురేపుతోంది. సోమశిల జలాశయం అపార మత్స్య సంపదకు నిలయం. నెల్లూరు, కడప జిల్లాలో విస్తరించిన పెన్నా నదిని నమ్ముకొని సుమారు రెండువేల మంది జాలర్లు చేపలవేట వృత్తిగా చేసుకొని జీవనం సాగిస్తున్నారు. అయితే ఏటా జలాశయంలో నిషేధిత అలివి వల వేట వివాదం వీరి మధ్య చిచ్చు రేపుతోంది. అలివి వలల వేటతో చిన్న,పెద్ద సైజు చేపలు వలకు చిక్కి వల లాగిన సమయంలో భారీగా మత్స్యసంపద బయటకు చేరుతోంది. ఈక్రమంలో చేపల ఉత్పత్తి తగ్గి జాలర్లకు వేట జరగడం కష్టంగా ఉంటోంది. ఈక్రమంలో ప్రభుత్వం అలివి వలతో ప్రాజెక్టులో వేట చేయరాదని నిషేధించింది. అయితే కొందరు స్థానికులు గుట్టుచప్పుడు కాకుండా బయటి వ్యక్తులను పిలిపించి జలాశయం లోతట్టు ప్రాంతానికి చేరుకొని రహస్యంగా నిషేధిత వలలతో వేటసాగించడంతో సోమశిలలో జాలర్ల మధ్య గొడవలు జరుగుతున్నాయి. జలాశయంలో అలివి వలతో వేటసాగిస్తున్నట్లు పలువురు మత్స్యకారులు ఇటీవల జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. అయినా లోతట్టు ప్రాంతంలో అక్రమవేట జరుగుతోందని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఇదేవిషయమై సోమశిల పోలీసుస్టేషన్‌లో గురువారం ఫిర్యాదు కూడా చేశారు. గతంలో ఇదే అంశంపై జాలర్ల మధ్య గొడవలు జరిగి పోలీసు కేసులు కూడా నమోదైన సందర్భాలు ఉన్నాయి. తాజాగా మళ్లీ అలివి వల వివాదం తెరపైకి రావడంతో స్థానికంగా ఎలాంటి సమస్యలు, గొడవలు జరుగుతాయోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.


జలాశయం లోతట్టులో వల లాగుతున్న జాలర్లు (ఫైల్)

జలాశయం వెనుక తనిఖీలు కరువు

సోమశిల ప్రాజెక్టు వెనుక తనిఖీలు చేయాలంటే సాహసంతో కూడిన పని. దీంతో వెనుక వైపు అధికారుల తాకిడి అంతగా ఉండదు. దాన్ని అదునుగా తీసుకొని కొందరు అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఏడాది క్రితం వేటకు వెళ్లిన ఓ జాలరిని కొందరు మద్యం మత్తులో హతమార్చారు. నాటు సారా తయారుచేస్తూ మత్తులో చీకటి కార్య కలాపాలకు దిగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సోమశిల నుంచి కడప జిల్లా వరకు ప్రాజెక్టు లోతట్టున సుమారు 20 నుంచి 25 కిలోమీటర్లు విస్తరించి వుండగా వెనుక వైపు స్థావరాలు ఏర్పాటు చేసుకొని చేపల వేట, ఎర్రచందనం, నాటుసారా తయారీ తదితర చీకటి పనులు సాగిస్తున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. అధికారులు అక్కడకు చేరుకొని తనిఖీ చేయాలనుకున్న సమాచారం వారికి ముందుగా తెలిసిపోతోంది. దీంతో వారు అప్రమత్తం అవుతు న్నారు. కాగా, లోతట్టులో జరిగే అక్రమ పనులను అడ్డుకోవడంలో కడప జిల్లాకు అనుకూలమైన పరిస్థితి ఉండగా వారు అంతగా శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉద్యోగ విరమణ వరకు అదే ఉత్సాహం ఉండాలి

- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి
- సాయుధ బలగాల వార్షిక సమీకరణ సమాప్తం


కవాతును వీక్షిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు (క్రైం), ఫిబ్రవరి 2: పోలీసులు యూనిఫాం వేసుకున్న తొలి రోజు ఉన్న ఉత్సాహం ఉద్యోగ విరమణ రోజు వరకు ఉండాలని ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. ఆకర్షణీయంగా అలంకరించిన పోలీసు కవాతు మైదానంలో ఆహ్లాదకర మైన వాతావరణంలో సాయుధ బలగాల వార్షిక సమీకరణ శుక్రవారం ముగిసింది. బ్యాండ్ పార్టీ వాయిద్యాల మధ్య సాయుధ బలగాలు కనువిందైన కవాతును వీక్షిస్తూ ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ వృత్తిపరమైన, వ్యక్తిగత క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ పోలీసుశాఖ కీర్తి ప్రతిష్ఠలు మరింత పెరిగేలా పనితీరు ఉండాలని సిబ్బందికి సూచించారు. సాధారణ బందోబస్తు నుంచి శాంతిభద్రతల పరిరక్షణ వరకు ఏఆర్ విభాగం పాత్ర కీలకమన్నారు. ఈ సమీకరణ సందర్భంగా అలవడిన ఉన్నత స్థాయి శారీరక ప్రమాణాలు, మానసిక సమతుల్యతను సంవత్సరం పాటు కొనసాగించాలన్నారు. అనంతరం జిల్లా నుంచి బదిలీపై వెళుతున్న కందుకూరు, సీసీఎస్, ఎస్సీ, ఎస్టీ సెల్, ఏఆర్ డీఎస్పీలు, అడ్మిన్, వెల్ఫేర్, ఎస్ఎస్ ఆర్ఐలు, ఆర్ఎస్ఐలను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

8న ఆశాల మహాధర్నా

- యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణమ్మ


కరపత్రాలు విడుదల చేస్తున్న యూనియన్ నేతలు

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 2 : ఆశా కార్యకర్తలకు సంబంధించిన పలు సమస్యలపై ఈ నెల 8వ తేదీన విజయవాడలో రాష్ట్రస్థాయి మహాధర్నా చేపడుతున్నట్లు ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ తెలిపారు. ఆ కార్యక్రమాన్ని ఆశాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు చెల్లించాలని, ఆశాలను కమ్యూనిటీ హెల్త్ వర్కర్లుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్‌లు, ప్రసూతి సెలవులతోపాటుగా రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. యాప్‌ల వినియోగంపై శిక్షణ ఇవ్వాలన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి మట్లాడుతూ రూ.10వేల వేతనం పేరుతో వెట్టి చాకిరి చేయిస్తున్నారని, అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని ఆరోపించారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ, భవాని తదితరులు పాల్గొన్నారు.

15 రోజులకోసారి సాగునీరు

- 10 రోజులకు ఇవ్వాల్సిందే : రైతులు


చర్చించుకుంటున్న రైతులు

అల్లూరు, జనవరి 2 : వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో రైతులకు 15 రోజులకోకసారి సాగునీటిని అందిస్తామని అధికారులు రైతులకు తెలిపారు. దీనికి రైతులు ససేమీరా అంటూ ప్రతి 10 రోజులకోకసారి సాగునీటిని అందించాల్సిందేనని స్పష్టం చేశారు. శుక్రవారం అల్లూరు ఇరిగేషన్ బంగ్లా వద్ద రైతులతో సంబంధిత అధికారులు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా రైతులు ముక్తకంఠంతో 15 రోజులకు కుదరదని, 10 రోజులకే ఇవ్వాలని తేగేసి చెప్పారు. దీంతో అక్కడే ఉన్న స్థానిక నాయకుడు నీలం సాయికుమార్ రైతులను, ఏఈ వినయ్‌ను సమన్వయపరచి అధికారులతో చర్చించి యధావిధిగా సాగునీటిన ప్రతి పది రోజులకోకసారి విడుదల చేస్తామని ప్రకటించారు. దీంతో రైతులు చర్చను ముగించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మేడా శ్రీనివాసులు రెడ్డి, ఉస్మాన్ షరీఫ్ పాల్గొన్నారు.

రేపు సౌత్‌జోన్ కర్రసాము పోటీలు


మాట్లాడుతున్న అసోసియేషన్ నేతలు

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 2 : నెల్లూరులోని చిల్డ్రన్స్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్వర్యంలో ఆదివారం సౌత్‌జోన్ కర్రసాము పోటీలు జరుగుతాయని నిర్వాహకుడు శింగంశెట్టి మురళీమెహన్‌రావు తెలిపారు. చిల్డ్రన్స్ పార్క్ వద్ద శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మనదేశ సంప్రదాయ పోటీలు నెల్లూరులో మొదటిసారి జరుగుతున్నాయని, ఇందుకు జిల్లా ప్రజలు తరలిరావాలని కోరారు. మరో నేత ఎద్దల రవి మాట్లాడుతూ అంతరించిపోతున్న మన కళలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. చిల్డ్రన్స్ పార్క్‌లు ఈ పోటీలు జరుగుతామని తెలిపారు. కరాటే అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ పోటీలకు తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు పాల్గొం టారని తెలియచేశారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ నేత కొట్టే రామూర్తి పాల్గొన్నారు.

కామాక్షితాయి ఆలయానికి రూ.46.63 లక్షల రాబడి

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 2: జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయానికి బహిరంగ వేలం ద్వారా రూ.46.63 లక్షల రాబడి వచ్చినట్లు ఆలయ ఈవో వీ.గిరికృష్ణ తెలిపారు. ఆలయానికి పుష్పాలు, కూరగాయలు, విద్యుత్ సామగ్రి, ప్లంబింగ్, పారిశుద్ధ్య సామగ్రి, పాలు, పెరుగు, శేషవస్త్రాలు, అరటి చెట్లు, ఆకులు సరఫరా చేసేందుకు శుక్రవారం టెండర్లు పిలిచారు. అలాగే తలనీలాల సేకరణకు వేలం నిర్వహించగా రూ.17.50 లక్షలు, వస్త్రాలు సేకరణకు రూ.25.09 లక్షలు, ఫొటోస్టాల్ నిర్వహణ కు రూ.4.04లక్షలు వచ్చింది. కొన్నింటికి టెండర్లు, వేలం పాటలు వాయిదా పడినట్లు తెలిపారు. ఈ వేలంలో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉప్పు రైతులకు వసతుల కల్పనకు కృషి చేస్తాం

- డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి

అల్లూరు, జనవరి 2 : ఉప్పు రైతులకు కనీస మౌలిక వసతులు కల్పిస్తామని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టరు సాంబశివారెడ్డి అన్నారు. మండలంలోని ఇస్కపల్లిలో శుక్రవారం ఉప్పు రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వరదల సమయంలో తమ భూముల కరకట్టలు కొట్టుకునిపోయి ఉప్పును నష్టపోతున్నాని రైతులు పేర్కొన్నారు. అదేవిధంగా రోడ్లు, బోర్లు లేకుండా ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఉత్పత్తి చేసిన ఉప్పును నిల్వ చేసుకునేందుకు అవసరమైన ప్లాట్‌ఫామ్‌లు ఏర్పాటు చేయాలని, షెడ్డులను తమకు అందుబాటులో ఉంచాలని కోరారు. వీటనిన్నటినీ పరిశీలించి త్వరితగతిన వసతులను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని పీడీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాబార్డు డీడీఎం రవిసింగ్, ఎల్‌డీఎం శ్రీకాంత్, డీపీఎం భానుప్రసాద్, ఎంపీడీవో జ్యోతి, సర్పంచు పాటి రంజిత్ కుమార్, నాయకులు బీద రమేష్‌బాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి

పరిశ్రమల స్థాపనకు ఆర్థిక సహాయం

- యూనియన్ బ్యాంకు రీజినల్ హెడ్ జోగారావు

నెల్లూరు(హరనాథపురం), జనవరి 2 : ఏపీఐఐసీ వారి ఎంఎస్ఎంఈ పార్కుల్లో పరిశ్రమ లు స్థాపించుకునే వ్యక్తులకు ఆర్థిక సహాయాన్ని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంద చేస్తోందని ఆ బ్యాంకు రీజనల్ హెడ్ జోగారావు తెలిపారు. శుక్రవారం నెల్లూరులోని బ్యాంకు రీజనల్ కార్యాలయంలో ఎంఎస్ఎంఈ అవుట్‌రీచ్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జోగారావు మాట్లాడుతూ తమ బ్యాంకు ద్వారా ఎక్కువ మందికి ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించామన్నారు. ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయరత్నం మాట్లాడుతూ పాత లీజు విధానానికి స్వస్తి చెప్పి కొత్తగా ఓఆర్ఎస్ బేసిస్‌లో భూకేటాయింపు జరుగుతుందని చెప్పారు. దీని ద్వారా ఎక్కువ మంది పరిశ్రమలు స్థాపించుకునేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. ప్రతి పారిశ్రామిక పార్కులో 16.2శాతం ఎస్సీలకు, 6 శాతం ఎస్టీలకు స్థలాలు రిజర్వ్ చేసి ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలశాఖ డీడీ షఫీ అహ్మద్, ఏపీ కేవీఐబీ డీడీ ప్రసన్నలక్ష్మి, ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ సరేష్, యూనియన్ బ్యాంకు చీఫ్ మేనేజర్ అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జోగారావు

చేనేతల జీవితాల్లో మార్పే లక్ష్యం

100రోజులుగా గ్రామాల్లో పర్యటిస్తున్నాం
చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 2 : ఎన్నో సమస్యలు, ఎన్నో సవాళ్లతో చేనేతలు బతుకునీడుస్తున్నారని, వారి జీవితాల్లో మార్పు రావాలనేదే లక్ష్యంగా చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ కృషి చేస్తోందని ఆ కమిటీ కన్వీనర్ బుధవరపు బాలాజీ పేర్కొన్నారు. శుక్రవారం నెల్లూరు లస్సీ సెంటర్‌లోని చేనేత కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లా డారు. 100 రోజులుగా చేనేతలు ఉండే గ్రామాల్లో పర్యటించి అక్కడ సమావేశాలు ఏర్పాటు చేయడంతోపాటు ప్రతి కుటుంబాన్ని కలిసి సమస్యలు తెలుసుకుంటూ వస్తున్నామ ని చెప్పారు. ఆ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేం దుకు ఆదివారం నగరంలో నిర్వహించనున్న చేనేత విజయభేరికి ప్రతి ఒక్క చేనేత కుటుంబం హాజరుకావాలని పిలుపు నిచ్చారు. కమిటీ గౌరవాధ్యక్షుడు నందం అశ్వత్థామ మాట్లా డుతూ నెల్లూరు మైపాడు రోడ్డు డీజీపీ కల్యాణ మండపం లో నిర్వహిస్తున్న విజయ భేరి సభకు అందరూ తరలిరావా లన్నారు. ఈ సమావేశంలో కమిటీ నాయకులు ఆశం సురేష్, తాళ్ల నరసింహ, సోమా గోపాల్, చప్రం మల్లికా ర్జున, రామనాథం, రాజశేఖర్, ఎర్ర ధనుంజయ, కన్నా బ్రహ్మయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐక్య కార్యాచరణ కమిటీ కన్వీనర్ బాలాజీ

వెండి స్వాధీనం.. అప్పగింత

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 2: పినాకినీ ఎక్స్‌ప్రెస్ రైలులో భారీగా వెండి ఆభరణాలను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే వాటికి సంబంధించిన బిల్లులు సక్రమమని స్పష్టత రావడంతో తిరిగి వ్యాపారులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గురువారం సాయంత్రం చెన్నై నుంచి విజయవాడకు వెళుతున్న పినాకినీ ఎక్స్‌ప్రెస్ రైలులో నెల్లూరు రైల్వే పోలీసులు తనిఖీలు చేస్తుండగా ఓ జ్యూయలరీ సంస్థకు చెందిన వ్యక్తి కేజీల్లో వెండి ఆభరణాలతో ప్రయాణిస్తున్నట్లు గుర్తించారు. ఆభరణాలను స్వాధీనం చేసుకోగా సదరు వ్యక్తి వాటికి సంబంధించిన బిల్లులు చూపడంతో ఆ బిల్లులను జీఎస్‌టీ అధికారులకు పంపారు. శుక్రవారం వాటిని పరిశీలించిన అధికారులు అవి సక్రమమని తేలడంతో స్వాధీనం చేసుకున్న ఆభరణాలను సదరు వ్యక్తికి అప్పగించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నెల్లూరు(క్రైం): ఆత్మహత్యకు యత్నించి వైద్యశాలలో చికిత్స పొందుతున్న మహిళ శుక్రవారం మృతి చెందింది. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని ఇసుక డొంక ప్రాంతంలో రాజ్యలక్ష్మి(44), శ్రీనివాసులు దంప తులు నివసిస్తున్నారు. వారికి మౌనిక అనే కుమార్తె కలదు. శ్రీనివాసులు కొంత కాలం కిందట మృతి చెందగా రాజ్యల క్ష్మి అంగన్‌వాడీ హెల్పర్‌గా పని చేస్తూ కుమార్తెను పోషిం చుకుంటోం ది. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది. చికిత్స తీసుకుంటున్న ఆరోగ్యం కుదుట పడటం లేదని మనస్థాపానికి గురైన ఆమె ఈ నెల 1వతేదీ ఎలు కల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. స్థానికులు నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. రాజ్యలక్ష్మి కుమార్తె సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ కిరణ్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 2 : కేంద్రం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ బడ్జెట్ మొత్తం అబద్ధాలతో కూడి ఉందని, దీనిలో విద్యారంగానికి తీరని అన్యాయం జరిగిందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వీ నరేంద్ర విమర్శించారు. శుక్రవారం నగరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వాస్తవాలకు బహుదూరంగా మాట్లాడటం బాధాకరమన్నారు. ఉన్నత విద్యారంగంలో 28 శాతం విద్యార్థినుల ఎన్‌రోల్‌మెంట్ పెరిగిందనడం, సైన్స్, టెక్నాలజీ ఇంజనీరింగ్, మెడికల్ విభాగాల్లో విద్యార్థినుల చేరిక 43శాతంగా ఉందని, ప్రపంచలోనే ఇది అత్యుత్తమైందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కేంద్రీయ విద్యాలయాలు, పాఠశాలలు, నవోదయాల్లో కనీస సదుపాయాలు లేవని ఆరోపించారు. ఇప్పటి వరకు ఎన్ని లక్షల మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 390కి పైగా ప్రైవేట్ యూనివర్సిటీలకు అనుమతిలిచ్చి ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. విద్యారంగాన్ని ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్రలు చేస్తోందని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో విద్యా ప్రమాణాలు పెరగాలంటే బడ్జెట్ కేటాయింపులు పెరగాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎం శ్రీహర్ష, నేతలు చరణ్, చందు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అడవి పందుల సంచారం

- హడలిపోతున్న ప్రజలు

బిట్రగుంట, ఫిబ్రవరి 2: బోగోలు మండలంలోని పలు పంచాయతీలలో అడవి పందులు విచ్చలవిడిగా సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళనతో హడలిపోతున్నారు. బిట్రగుంట రైల్వే స్టేషన్ పరిధిలో అడవి పందులను చూసిన రైలు ప్రయాణికులు శుక్రవారం భయాందోళన చెందారు. పందుల శరీరంపై వెంట్రుకలు నిలిచి ఉన్న తీరును చూసిన వారు ముళ్లపంది మారుజాతి (క్రాస్ బ్రీడ్) అంటున్నారు. గ్రామాల్లో సంచరించే పందుల ముఖంలా కాకుండా కోరలు కలిగి ఉండటం వలన అడవి పందులే అని భయపడుతున్నారు. ప్రయాణికులకు, ప్రజలకు ఎటువంటి ప్రమాదాలు జరుగక ముందే అధికారులు తగినచర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


రైల్వేస్టేషన్ ప్రాంతంలో సంచరిస్తున్న అడవి పందులు

నెల్లూరు నగరంలో దొంగల హల్‌చల్

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 2: నెల్లూరు నగరం, రూరల్ ప్రాంతాల్లోని దుకాణాల్లో శుక్రవారం తెల్ల వారుజామున దొంగలు వరుస చోరీలకు పాల్పడ్డారు. వేదాయపాళెంలోని ఓ సూపర్ మార్కెట్ షట్టర్ తెరిచి అందులో ఉన్న సుమా రు రూ.60 వేలకుపైగా నగదు ను దోచేశారు. సమీపంలోని పలు దుకాణాలను కొల్లగొ ట్టినట్లు తెలిసింది. బాలాజీ నగర్ పోలీసుస్టేషన్ పరిధిలో మినీబైపాస్‌లోని ఓ బట్టల దుకాణం షట్టర్ తెరిచి రూ.35 వేలు నగదు, కళ్లజోళ్లను అపహ రించుకుని వెళ్లారు. రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని కల్లూరు పల్లిలో ఓ దుకాణం లోనూ ఇదే తరహాలో చోరీకి పాల్పడ్డారు. సీసీ ఫుటేజ్‌లలో ఆనవాళ్లు దొరక్కుండా ఉం డేందుకు దుకాణాల్లోని డిజిటల్ వీడియో రికా ర్డర్లను కూడా తీసుకెళ్లిపోయారు. బాధితుల నుంచి చోరీ సమాచారం అందుకున్న సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులు ఘటనా స్థలాలను పరిశీలించారు. క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించింది. చోరీలు జరిగిన తీరును బట్టి దుండగు లు ఉత్త ర భారతదేశానికి చెందిన వారై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	120
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	216
స్కిన్‌లెస్	242
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6017
వెండి కిలో ధర	రూ. 73,800
వెండి ఒక గ్రాము	రూ. 75.80



రియల్ ఎస్టేట్
నెల్లూరు-సిటీ, రూరల్, బుచ్చి, కాకుపల్లిలలో ప్లాట్లు, అపార్ట్‌మెంట్‌లు, ఇండ్లు అమ్మదలచిన వారు కొనదలచిన వారు సం.ప్ర. దుర్గా రియల్ ఎస్టేట్, సెల్: 86390 76658
AJR-156644

వెంటనే కావలెను
P.N.మోటార్స్ (హీరో షోరూం) వింజమూరు నందు పనిచేయుటకు క్యాషియర్, సేల్స్‌గల్, మెకానిక్‌లు, హెల్పర్‌లు కావలెను. వివరాలకు సం.ప్ర. సెల్: 98667 16212
AJR-156645

FLAT FOR SALE
నెల్లూరు, మనుబోలు హైవే, గూడూరు, చెన్నూరులలో అతి తక్కువ ధరకే నుడా అప్రూవల్ కలిగిన ఓపెన్ ప్లాట్స్ కేవలం 10 లక్షలు మాత్రమే, స్పాట్ రిజిస్ట్రేషన్, బ్యాంక్ లోన్ సౌకర్యం. సం.ప్ర.సెల్: 912145 9131, 94400 46140
AJR-178203

ఓం శక్తి ప్రశ్నమ్
విద్య, ఉద్యోగం, ప్రేమ, పెళ్లి, భార్యభర్తల కోర్టు సమస్యలు మరియు వ్యాపారం, కళారంగం, రాజకీయం, గ్రహ, గృహ సమస్యలను మీ ముఖం చూసి చెప్పబడును. శాంతి పూజలు చేయించబడును. ఓం శక్తి జ్యోతిష్యాలయం, శ్రీ రాజరాజేశ్వరి గుడి ఎదురుగా, నెల్లూరు. సెల్: 70974 44947
AJR-1693

రామేశ్వరం యాత్ర
తేది:04-02-24 నెల్లూరు నుండి రామేశ్వరం యాత్ర 5 రో.. తేది:12-05-24 కాశీ, ఢిల్లీ, హరిద్వార్ యాత్ర 18 రో.. ఉ.కాఫీ, టిఫిన్, భోజన వసతులతో S.V.S. ట్రావెల్స్, సం.ప్ర. సెల్: 94406 91243
AJR-156676

WANTED
నెల్లూరులోని FMGC కంపెనీ కార్తికేయ పోప్స్ ఇండస్ట్రీ నందు జాబ్ చేయుటకు ఏరియా సేల్స్ ఆఫీసర్, సేల్స్ ఆఫీసర్/ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు. సం.ప్ర. సెల్: 99493 93639
AJR-156400

మూలికా వైద్యం
అంగస్థంబన లేకపోవడం, సెక్స్‌లో ఎక్కువసేపు చేయలేకపోవడం, అంగం లావుగా, దృఢంగా, బలంగా ఉండుటకు మూలికౌషధం. వయస్సు పైబడిన వారు కూడా వాడవచ్చు. డా. సిహెచ్. రామకృష్ణ, VJA సెల్ : 84650 56299
AJB-914

అమ్మబడును
నెల్లూరు జిల్లా, కందుకూరు టౌన్‌లో ఉత్తర ఈశాన్య సోల కలిగిన 30గ.ఇంటి స్థలం. 60అ.రోడ్డు, టౌన్‌లో గది 20 వేలకు ఇంటి స్థలాలు కలవు. నూతన బైపాస్ ప్రక్కన ఒక ఎకరం అమ్మబడును. సం.ప్ర। సెల్: 9704250705
AJO-183670

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

మూలపడ్డ ఎండీయూ వాహనాలు

● సరుకుల కోసం దుకాణాలకు కార్డుదారుల పరుగులు



తహసీల్దారు కార్యాలయం వద్ద నిరుపయోగంగా మూలన పడి వున్న ఎండీయూ వాహనం

మర్రిపాడు, ఫిబ్రవరి 2: రేషన్ కార్డుదారులకు ఇంటివద్దే సరుకులు అందించడానికి ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన ఎండీయూ వాహనాలు మండలంలో కదలడం లేదు. నాలుగు వాహనాలను నిర్వాహకులు మూలపడేశారు. దీంతో పాత పద్ధతిలోనే కిలోమీటర్ల మేర పోయి దుకాణాలలో సరుకులు తెచ్చుకుంటున్నారు. మండలంలో 24 పంచాయితీల్లో 76 గ్రామాల్లో 13854 మంది రేషన్ కార్డుదారులు వున్నారు. బియ్యం పంపిణీ కోసం మండలంలో 8 ఎండీ యూ వాహనాలు ఏర్పాటు చేశారు. ఒక్కో వాహనానికి 1500నుండి 2000 కార్డులు కేటాయించి, రెండు మూడు గ్రామ పంచాయతీలను అప్పగించారు. కానీ నిర్వహణ భారం పెరిగిందని, గిట్టుబాటు కాక 4 వాహనాలను పూర్తిగా నిలిపి వేశారు. మిగతా వాహనాలు ఒక నెల ఆగుతూ మరో నెల కదులుతుండటంతో సరుకులు ఎక్కడ ఇస్తారో తెలియడం లేదని, చౌక దుకాణాలను ఆశ్రయించక తప్పటం లేదని కార్డుదారులు వాపోతున్నారు. సమస్యను అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందని, చివరకు గడపగడపకు కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేకి విన్నవించుకున్నా ఫలితం లేకపోయిందని, ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ప్రతీ గ్రామంలో ఇంటింటికీ నిత్యావసర సరుకులు అందేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బడుగు, బలహీనవర్గాల సంక్షేమం టీడీపీ ధ్యేయం : చెంచలబాబు



మాట్లాడుతున్న చెంచలబాబు యాదవ్

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 2: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం తెలుగుదేశం పార్టీ ధ్యేయం అని పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక చెంచలబాబు అతిథిగృహంలో నియోజకవర్గ టీడీపీ బీసీ సంఘం అధ్యక్షుడు మతకాల శ్రీనివాసుల యాదవ్ అధ్యక్షతన ఉదయగిరి, వరికుంటపాడు మండలాల జయహో బీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత బీసీలను టీడీపీకి దూరం చేసేందుకు దాడులు చేసి కేసులు నమోదుచేసి వేధించినా వారిలో ఆత్మవిశ్వాసం చచ్చిపోలేదన్నారు. వైసీపీకి ఓటు ఎందుకేశామా అని బీసీలు పశ్చాతప పడుతున్నారన్నారు. ఎప్పుడు ఎన్నికలు వస్తాయా జగన్‌ను గద్దె దింపుదామా అని ఎదురుచూస్తున్నారన్నారు. బలహీన వర్గాలకు నిధులు, విధులు, కుర్చీల్లేని 56 కార్పొరేషన్ చైర్మన్ పదవులు అలంకారప్రాయంగా అంటగట్టారన్నారు. టీటీడీ చైర్మన్ పదవి బీసీలకు ఇచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. జరగనున్న ఎన్నికల్లో టీడీపీ 160 స్థానాలు సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కప్పిర శ్రీనివాసులు, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, నాయకులు శ్రీకుర్తి రవీంద్రబాబు, రియాజ్, సందానీ, పోలిశెట్టి, గూడూరు వెంకటేశ్వరరావు, శ్రీకాంత్, వాసు, హరికృష్ణ, బాస్కర్, రేవతి, అరుణపాల్గొన్నారు.

అధిష్ఠానం ఆదేశిస్తే పోటీ చేస్తా

టీడీపీ అధిష్ఠానం ఆదేశిస్తే నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేస్తానని చెంచల బాబుయాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఇటీవల టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడుకు నెల్లూరు పార్లమెంట్‌కు తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని విన్నవించినట్లు తెలిపారు. జిల్లాలో అవినీతి, అక్రమాలకు తావు లేకుండా ఐదేళ్ల జడ్పీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఏకైక బీసీని తానేనన్నారు. ఎంతటి ధనవంతుడు పోటీ చేసినా తట్టుకొనే సత్తా ఉందని, తప్పకుండా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

కులగణన సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ

ఉదయగిరి, ఫిబ్రవరి 2: మండలంలో జరుగుతున్న కులగణన సర్వేను సచివాలయ సిబ్బంది, వలంటీర్లు బాధ్యతగా చేపట్టాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. సర్వే బృందం ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు నమోదు చేయాలన్నారు. నిర్ణీత గడువు లోపు సర్వే పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరిసాగుపై అవగాహన

అనంతసాగరం, ఫిబ్రవరి 2: స్థానిక సచివాలయం-1లో శుక్రవారం రైతులకు వరిసాగులో సస్యరక్షణ చర్యలపై అధికారులు అవగాహన కల్పించారు. ఏదశలో ఎలాంటి పురుగుమందులు వాడాలి, తెగుళ్ల నివారణ చర్యలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం రైతు శిక్షణ సహాయ సంచాలకులు మధవి, వ్యవసాయాధికారులు వాసు, శ్రీదర్‌రెడ్డి పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 2: మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన గెట్టిబోయిన రమణయ్య విద్యుదాఘాతంతో మృతిచెందడంతో నియోజకవర్గ టీడీపీ నాయకుడు, కాకర్ల చారిటబుల్ ట్రస్టు అధినేత కాకర్ల సురేష్ శుక్రవారం తన ప్రతినిధులచే కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చుల కోసం ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గడ్డం నాయుడు, శ్రీరాములు, రామలక్ష్మి, ట్రస్టు ప్రతినిధులు జల్సాయాదవ్, తుమ్మల కిరణ్, హరీష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న మేకపాటి రాజగోపాల్ రెడ్డి

సీతారామపురం, ఫిబ్రవరి 2 : మండల పరిధిలోని బసినేనిపల్లి గ్రామ సచివాలయ ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష 2వ విడత కార్యక్రమాన్ని ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం బసినేనిపల్లి గ్రామ ప్రాంతంలోని మర్రివూట్ల రిజర్వాయర్ వద్ద ఉన్న రామయ్య స్వామి ఆశ్రమాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ భార్గవి, డాక్టర్ స్వప్న, వైసీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ బాలినేని మాబయ్య, అయ్యవారిపల్లి సర్పంచ్ దుగ్గయ్య, పిడతల ఓబులేష్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

వింజమూరు: వింజమూరు గ్రామ సచివాలయం-1లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మురళీధర్, డాక్టర్ పర్వత, ఎముకల డాక్టర్ మధు, మధుసూదన్ పాల్గొన్నారు.

మెట్ట పంటలకు సాగునీరు విడుదల



రైతులతో మాట్లాడుతున్న జలవనరుల శాఖ ఈఈ, డీఈలు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 2: మండలంలోని గండిపాళెం జలాశయం ఆయకట్టు భూముల్లో సాగు చేసిన మెట్ట పంటలకు సాగునీరు విడుదల చేసినట్లు జలవనరుల శాఖ ఈఈ ఆర్ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం అధికారులతో కలిసి జలాశయాన్ని పరిశీలించి రైతులతో చర్చించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ జలాశయంలో ప్రస్తుతం 9.5 అడుగుల మేర నీరు ఉందన్నారు. ఆయకట్టు భూముల్లో మెట్ట పంటలు సాగు చేసిన రైతులు పంటలు ఎండుతున్నాయి, నీరు వదలాలని కోరడంతో కుడి కాలువకు 30, ఎడమ కాలువకు 50 క్యూసెక్కుల చొప్పున నీరు విడుదల చేశామన్నారు. తొలుత స్థానిక సబ్ డివిజన్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసి సిబ్బందికి తగు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళి, ఏఈలు వేణు, సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగరం ఎంపీడీవోగా షేక్ తాజ్‌మాస్రూర్

అనంతసాగరం, ఫిబ్రవరి 2: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జరిగిన బదిలీల్లో అనంతసాగరం ఎంపీడీవో మదుసుదన్‌రావు చిత్తూరుకు వెళ్లగా కుప్పంలో పనిచేస్తున్న ఎంపీడీవో షేక్ తాజ్‌మాస్రూర్ అనంతసాగరంకు బదిలీపై వచ్చి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

సంగం ఎంపీడీవోగా శేషగిరిరావు

సంగం, ఫిబ్రవరి 2: సంగం ఎంపీడీవోగా చిత్తూరు జిల్లాకు చెందిన పి శేషగిరిరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న గోపీ త్వరలో జరగనున్న ఎన్నికల్లో భాగంగా చిత్తూరుకు బదిలీ అయ్యారు.

సీతారామపురం ఎంపీడీవోగా ఆజాద్

సీతారామపురం, ఫిబ్రవరి 2: సీతారామపురం ఎంపీడీవోగా అబ్దుల్ కలాం ఆజాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో రంగసుబ్బరాయుడు సస్పెండ్ కావడంతో ఇప్పటివరకు ఈవోపీఆర్డీ భార్గవి ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేశారు.

పాఠశాల భవనం స్వాధీనం



పాఠశాలకు తాళాలు వేసి స్వాధీనం చేసుకున్న ఎంఈవో జానకిరామ్

సంగం, ఫిబ్రవరి 2: మండలంలోని అమరపనాయుడు కండ్రిక గ్రామంలో మూతపడి ఆక్రమణకు గురైన పాఠశాల భవనాన్ని శుక్రవారం ఎంఈవో జానకిరామ్ స్వాధీనం చేసుకున్నారు. అమరపనాయుడు కండ్రికలో పాఠశాల విద్యార్థులు లేక చాలా సంవత్సరాల కిందట మూతపడింది. దీంతో పాఠశాల భవనాన్ని గ్రామానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు ఆక్రమించి సొంత అవసరాలకు వాడుకుంటుండడంతో గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బాణా శ్రీనివాసులురెడ్డి స్పందనలో ఫిర్యాదు చేశారు. దీంతో ఎంఈవో జానికీరామ్ పాఠశాల భవనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

వైద్యసేవలు అందక పశుపోషకుల అవస్థలు

అనంతసాగరం, ఫిబ్రవరి 2: స్థానిక పశువైద్యశాలలో వైద్యసేవలు సక్రమంగా అందడంలేదని పశుపోషకులు వాపోతున్నారు. రెండేళ్ల క్రితం డాక్టర్ సుబ్బానాయుడు పర్యవేక్షణలో ఇక్కడ మూగజీవాలకు మెరుగైన వైద్యసేవలు అందేవి. కలువాయి, చేజర్ల, రాపూరు మండల రైతులు కూడా పశువులను తీసుకొచ్చి అనంతసాగరంలో వైద్యసేవలు పొందేవారు. ఆయన బదిలీ అనంతరం రెగ్యులర్ డాక్టర్‌ను నియమించలేదు. ఇక సిబ్బందే గత్యంతరం కాగా, వైద్యసేవలు సక్రమంగా అందక పశుపోషకులు అవస్థలు పడుతున్నారు.

పొగాకు రైతులను వెంటాడుతున్న కష్టాలు!

కలిగిరి, ఫిబ్రవరి 2: కలిగిరి పొగాకు బోర్డు వేలం కేంద్రం పరిధిలో రైతులను కష్టాలు వెంటాడుతోన్నాయి. 2023-24 పంటకాలానికి 1300 బ్యారన్‌లు రిజిస్ట్రేషన్ కాగా, ఒక్కో బ్యారన్‌కు 7.5 ఎకరాలు సాగుకు బోర్డు అధికారులు అనుమతి ఇచ్చారు. అయితే గతేడాది నవంబరు నెలలో వర్షాలు కురవడంతో అదునుకు వర్షం పడిందనే సంతోషంతో రైతులు పంట సాగు చేశారు. ఈ వర్షం అధికంగా పడటంతో పొగాకు పంట ఎదుగుదల లోపించి తోటలు గిటకబారాయి. ఈ క్రమంలో రైతు బోర్డు అనుమతించిన 7.5 ఎకరాలకు అదనంగా మరో 2.5 ఎకరాల వరకు సాగుచేశారు. ఆ తరువాత డిసెంబరు, లేదా జనవరి నెలలో కనీసం ఒక వర్షం అయినా పడుతుందనే ఆశతో సాగు చేసిన రైతుకి వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో పొగాకు తోటలకు నీరు పెట్టాల్సిన అవసరం ఏర్పడింది. అదనంగా సాగు చేయడంతో నీటి కష్టాలు తోడయ్యాయి. దీనికితోడు పొగాకు ఆకు కొట్టే ముఠా(కూలీలు)కు ఎకరాల దామాషా ప్రకారం కూలీ చెల్లించాల్సి రావడంతో మొత్తం మీద బ్యారన్‌కు 20శాతం మేర పెట్టుబడుల భారం అధికమైంది. దీంతో దిగుబడులు వచ్చినా నాణ్యత అంతంత మాత్రం వస్తుండటంతో పొగాకు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక విస్తీర్ణంలో పొగాకు సాగుచేసి ఇబ్బందులు పడవద్దని రైతులకు సూచిస్తున్నట్లు బోర్డు అధికారులు తెలియజేస్తున్నారు. ఏది ఏమైనా ఈ ఏడాది పొగాకు రైతుకు సాగు నుంచే కష్టాలు వెన్నంటి ఉన్నాయని, దిగుబడి, నాణ్యత, ధరల ప్రభావం పొగాకు రైతును ఎటు తీసుకెళ్తుందో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కోళ్ల వ్యర్థాలతో అవస్థలు



ట్యాంక్ బండ్‌పై ఉన్న కోళ్లను తరలించే ఇనుప బుట్టలు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 2: కోళ్లను రవాణా చేసే వాహనాలు పట్టణంలోని ట్యాంక్‌బండ్‌పై వ్యర్థాలను పడేస్తుండడంతో అపరిశుభ్రత నెలకొంటుంది. ట్యాంక్‌బండ్‌పై ఆహ్లాదకర వాతావరణం ఉండడంతో పట్టణ ప్రజలు వాకింగ్ చేయడం, సాయంత్రం సమయంలో అక్కడే కూర్చొని సేదతీరుతుంటారు. వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. అయితే కోళ్ల వ్యర్థాల వల్ల దుర్వాసన వెదజల్లుతుండడంతో ప్రజలు అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

పల్లెల్లో పేకాట జోరు!

● అప్పుల ఊబిలో కూరుకుపోతున్న జూదరులు

● విచ్ఛిన్నమవుతున్న పచ్చని సంసారాలు



శాఖవరంలో పోలీసులకు పట్టుబడ్డ పేకాటరాయుళ్ళు (ఫైల్)

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 2: మండలంలో పేకాట జోరుగా సాగుతోంది. అందినకాడికి అధిక వడ్డీలకు అప్పులు చేసి పేకాటలో పోగొట్టుకుంటున్న జూదరులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. దీంతో పచ్చని సంసారాలు విచ్ఛిన్నం అవుతోన్నాయి. పోలీసులు దాడులు చేస్తున్నా రోజుకో చోటకు పేకాట నిర్వహణ కేంద్రాలను మార్చి పోలీసులకే సవాలు విసురుతున్నారు. మండలంలోని శాఖవరం, అయ్యవారిపల్లె, చుండి, పోలినేనిచెరువు, మాలకొండ, శింగమనేనిపల్లె, పోకూరు, పోలినేనిపాలెం, కళవళ్ల, నలదలపూరు, రామలింగాపురం తదితర గ్రామాల్లో పేకాట జోరుగా నిర్వహిస్తున్నారు. ఇళ్లు, కొండలు, గుట్టలు, అడవులు, పొలాలు అటవీ ప్రాంతాల్లోని మారుమూల గ్రామాల్లో రహస్యంగా పేకాట స్థావరాలను ఏర్పాటు చేసుకొంటున్నారు. గత వారం శాఖవరం పొలాల్లో పోలీసులు పేకాట స్థావరంపై దాడులు చేసి 10 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.1.90 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే గతంలో పోకూరు, శింగమనేనిపల్లె, నలదలపూరు, పోలినేనిపాలెం, చుండి తదితర గ్రామాల్లోనూ పోలీసులు దాడులు చేసిన సంఘటలు అనేకం ఉన్నాయి. పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో గతంలో నలదలపూరులో ఓ వ్యక్తి చెరువులో దూకి మృతి చెందిన విషయం విదితమే. కాకర్లవారిపాలెం వద్ద పేకాట స్థావరానికి కాపలా ఉన్న యువకుడిని పేకాటరాయుళ్లు మద్యం మత్తులో కొట్టి చంపేశారు. ఇలా చెప్పుకుంటూపోతే పేకాట జూదం వలన అనేక సంఘటనలు చోటుచేసుకొని పలువురు మృతి చెందారు. అయినా పేకాట మాత్రం ఆగడం లేదు. రోజుకో చోట స్థావరం మార్చుకుని ఉదయం 11 గంటలకు రహస్య స్థావరానికి చేరుకుంటారు. రాత్రి 10 గంటల వరకు జూదం జరుగుతోంది. జూదరులను పేకాట స్థావరానికి చేర్చే నిర్వాహకుడే అందరి సెల్‌ఫోన్లు సేకరించి తన వద్ద ఉంచుకుంటాడు. ఓ వ్యక్తి స్థావరం నలువైపులా గస్తీ తిరుగుతుంటాడు. కార్లు, పోలీసులు, కొత్త వ్యక్తులు ఎవరైనా వస్తే వెంటనే పేకాటరాయుళ్లకు సమాచారం అందిస్తాడు. వెంటనే వారు పారిపోతారు. ఆయా ప్రదేశాలలో లక్షలలో పేకాట జరుగుతుంది. పేకాట మోజులో పడి ఆస్తులు సైతం తాకట్టు పెడుతున్నట్లు సమాచారం. అలాగే రోజుకు నూటికి రూ.10 వడ్డీకి తెచ్చి పేకాట ఆడుతున్నట్లు సమాచారం. చివరకు వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దీంతో ఎన్నో కుటుంబాలు వీధిన పడుతుండగా కొందరు బయటకు చెప్పుకోలేకపోతున్నారు. పోలీసులు దాడులు చేస్తున్నా పోలీసుల కళ్లుగప్పి రోజుకో స్థావరం ఏర్పాటు చేసుకొని జోరుగా పేకాట నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు నిఘా పెట్టి మూడు ముక్కలాటను నియంత్రించాలని, మరిన్ని కుటుంబాలు వీధినపడి ఆత్మహత్యలు చేసుకోకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

భూ పంపిణీ చేయకుండా బడుగులకు ద్రోహం

● ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నేతలు

కావలి, ఫిబ్రవరి 2: అసైన్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి నియోజకవర్గంలో భూ పంపిణీకి ప్రయత్నించకపోవడం బడుగులకు ద్రోహం చేయడమేనని దళిత సంరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేసి ఆర్డీవో శీనానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల వేళ జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో భూ పంపిణీకి సిద్ధమవుతుండగా కావలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రతి మండలంలో వివిధ రకాల ప్రభుత్వ భూములు 1,500 ఎకరాల వరకు ఉన్నా ఎమ్మెల్యే భూ పంపిణీ చేపట్టలేదన్నారు. నియోజకవర్గంలో 3వేల ఎకరాలలో గ్రావెల్ ఎత్తుకుని అమ్ముకునేందుకు రియల్‌ఎస్టేట్ వ్యాపారులను ప్రోత్సహించి వ్యవసాయ భూములను సాగుకు పనికి రాకుండా చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా పేదలపై మ్మెల్యేకి దయ ఉంటే ఎన్నికల కోడ్ వచ్చే లోపు భూ పంపిణీకి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో యానాది సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బాపట్ల సత్యవతమ్మ, ఎమ్మార్పీఎస్ నాయకుడు జరుగుమల్లి విజయరత్నం, నేతలు నారుబోయిన లక్ష్మీనర్సు, చౌటూరు వెంకటరత్నం, పోట్లూరు విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాలకొండలో దుకాణాలకు వేలం

● 4 షాపులకు రూ.22.13 లక్షలు రాబడి



వేలం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 2 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ దుకాణాలకు మాలకొండ కల్యాణ మండపంలో శుక్రవారం కందుకూరు జనార్ధనస్వామి ఆలయం కార్యనిర్వాహణాధికారి బైరాగిచౌదరి పర్యవేక్షణలో బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. 12 దుకాణాలకు వేలం నిర్వహించగా వివిధ కారాణాలతో 8 దుకాణాల వేలం వాయిదా పడింది. 4 షాపుల వేలం పాటల ద్వారా ఆలయానికి రూ.22.13 లక్షలు రాబడి వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ కేబీ.శ్రీనివాసరావు తెలిపారు. నెయ్యి, పాలు విక్రయానికి రూ.89 వేలు, బొమ్మలు దుకాణం-1 రూ.3,72,000, బొమ్మల దుకాణం-2 రూ.3,21,000, రెండు కూల్‌డ్రింక్స్ దుకాణాలు రూ.14,31,000 పాడుకున్నారు. మిగిలిన తలనీలాలు, కొబ్బరిచిప్పలు, వాహన పార్కింగ్ రుసుం, చీరలు, జాకెట్ పీసులు, కొబ్బరికాయలు రెండు దుకాణాలు, అద్దములు, ఫొటోలు దుకాణం, ఫలహారశాల, పాదరక్షలు భద్రపరచు తదితర వాటికి సరైన పాట రానందున వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు.

దళితులపై దౌర్జన్యం తగదు



డీటీకి వినతిపత్రం ఇస్తున్న దళితులు

బిట్రగుంట, ఫిబ్రవరి 2: పేద దళితులపై దౌర్జన్యం చేస్తున్న పెత్తందారులపై అధికారులు చర్యలు తీసుకోవాలని కావలి డివిజన్ అంబేడ్కర్ మిషన్ కన్వీనర్ బత్తుల రవిచంద్ర కోరారు. ఈ మేరకు శుక్రవారం బోగోలు తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు వెంకటేశ్వర్లుకు దళితులతో కలసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమామహేశ్వరపురంలో నివాసముంటున్న కాకాని నాగరాజు కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గ్రామంలోని సర్వే నంబరు 95లో ఉన్న ప్రభుత్వ భూమిలో ఏడేళగా వ్యవసాయం చేసుకుంటుండగా గత నెల జనవరి 25వ తేదీన వర్షాభావ పరిస్థితుల కారణంగా నువ్వు పంట చల్లుకున్నాడన్నారు. దానిని దగదర్తి మండలానికి చెందిన కాసుల ప్రభాకర్ అనే వ్యక్తి ఫిబ్రవరి 8వ తేదీన దౌర్జన్యంగా దున్నేశాడని, దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అధికారులు స్పందించి నాగరాజుకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు రమణయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, శీనయ్య, పెంచలయ్య, కే.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం అధ్వానం

● వీధుల్లోనే చెత్తకుప్పలు ● అంతర్గత రహదారుల పరిస్థితి దయనీయం



కోవూరురోడ్డులోని సాయినగర్‌లో కాలువలో పేరుకుపోయిన మురుగు

కందుకూరు, ఫిబ్రవరి 2: కందుకూరు పట్టణంలో పారిశుధ్యం నిర్వహణ అధ్వానంగా ఉంది. సరైన ప్రణాళిక, పర్యవేక్షణ లేక అధ్వానంగా ఉన్న పారిశుధ్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారులలో మినహా శివారు ప్రాంతాలు, నివాస ప్రాంతాల్లో పారిశుధ్యం నిర్వహణ మరీ దారుణంగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారులలో కూడా అనేకచోట్ల మూడు నాలుగు రోజులు చెత్త తొలగించకపోతుండటంతో నడిరోడ్లపైనే చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇక నాలుగైదు ప్రధాన రహదారులు దాటి లోపలి నివాస ప్రాంతాలు ఉండే వీధుల్లోకి వెళ్లితే పారిశుధ్యం దారుణంగా ఉంటుంది. ఇక శివారు కాలనీలలో అయితే పరిస్థితి చెప్పాల్సిన అవసరం లేదు. అనేక ప్రాంతాలలో నెలకు ఒక్కసారి కూడా మురుగు కాలువలు శుభ్రం చేస్తున్న పరిస్థితి లేకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుర్రంవారిపాలెం, వరపర్లపాలెం, కోవూరు రోడ్డు సాయి నగర్, బలరామయ్య తోట, సింహాద్రి నగర్, మాయబజార్, కాళిదాసువారి వీధి, నందావారి వీధి, విప్పగుంట రోడ్డు ప్రాంతాలలో మురుగు కాలువల్లో మురుగు పేరుకుపోయి దర్శనమిస్తోంది. ఇటీవల మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమ్మె కారణంగా కొద్ది రోజులు మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడంతో పట్టణమంతా చెత్తాచెదారం పేరుకుపోయింది. సమ్మె విరమించాక కార్మికులకు అదనపు పనిపడటం దీనికితోడు పర్యవేక్షణ కూడా అంతంతమాత్రంగా మారడంతో అనేక ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ జరిగి నెలరోజులకు పైనే అయింది. దీంతో ఎక్కడి మురుగు అక్కడే పేరుకుపోయి ఉంది. ఇక మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గ్రామాల వైపు అయితే ఏడాదికి ఒకటి రెండు సార్లు కూడా పారిశుధ్య కార్మికులు కన్నెత్తి చూడని పరిస్థితి ఉంది. దీంతో గ్రామాల్లో మురుగు కాలువల పరిస్థితి మరింత దారుణంగా మారిపోయాయి. పలుచోట్ల అంతర్గత రహదారులు సైతం అధ్వానంగా ఉన్నాయి. మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక దృష్టి పెట్టి అన్ని ప్రాంతాలలో పారిశుధ్యం నిర్వహణ సక్రమంగా జరిగేలా సంబంధిత అధికారులు బాధ్యతతో పర్యవేక్షించేలా చూడాలని కోరుకుంటున్నారు.

కామాక్షితాయి, మల్లికార్జునస్వామి ఆలయ నిర్మాణ పనులు పరిశీలన

కావలి, ఫిబ్రవరి 2: పట్టణ పరిధిలోని బుడంగుంట క్రాస్ రోడ్డు వద్ద నిర్మాణంలో ఉన్న కామాక్షితాయి మల్లికార్జునస్వామి ఆలయ నిర్మాణ పనులను శుక్రవారం స్థపతి సురేంద్ర, ఏఈ మురళీ మోహన్‌లు పరిశీలించారు. పూర్తిస్థాయి నిర్మాణానికి అంచనాలను సిద్ధం చేశారు. ఆలయ వ్యవస్థాపక దర్మకర్తలు ద్రోణాదుల వెంకటకృష్ణారెడ్డి, లక్ష్మీసంపూర్ణమ్మలతో అక్కడ చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి సహకారంతో దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎండోమెంట్ కమిషనర్ జవహర్‌ను కలవడంతో వారి ఆదేశాల మేరకు ఆలయ నిర్మాణ అంచనాలకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

రక్త దానంతో ప్రాణదాతలుగా నిలవండి



రక్తదానం చేస్తున్న ఉపాధ్యాయులు

కావలి రూరల్, ఫిబ్రవరి 2: ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారికి ప్రాణదాతలుగా నిలవాలని సర్వాయపాలెం జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పాటూరి వెంకటరమణ పేర్కొన్నారు. మండలంలోని సర్వాయపాలెం హైస్కూల్‌లో శుక్రవారం రక్తదానంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. టీవీఎస్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ తోట వెంకటేశ్వర్లు పాల్గొని రక్తదానంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఉపాధ్యాయులు సీహెచ్.వెంకటేశ్వర్లు, పీవీకే.భాస్కర్, వై.సుధాకర్, ఎం.సమీర్ రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బృందం కె.హరినారప రెడ్డి, డీవీ.పద్మావతి, శేషమ్మ, వెంకటేశ్వర్లు, అనిల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ బీసీ పాయింట్ ప్రారంభం



బ్యాంక్ మేనేజర్ లక్ష్మణ్‌ను సత్కరిస్తున్న స్థానికులు

కావలిటౌన్, ఫిబ్రవరి 2: పట్టణంలోని ముసునూరు యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ముసునూరులో ఏర్పాటు చేసిన బీసీ పాయింట్‌ను శుక్రవారం బ్యాంక్ మేనేజర్ లక్ష్మణ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న అవసరాల కోసం బ్యాంక్ వద్దకు రాకుండా బీసీ పాయింట్ ద్వారా రూ.1000 నుంచి రూ.1,00,000 వరకు విత్‌డ్రా చేసుకోవచ్చన్నారు. రైతులు, చిన్న వ్యాపారులు, పొదుపు సంఘాల మహిళలు బీసీ పాయింట్‌లు సద్వినియోగం చేసుకుని సమయం ఆదా చేసుకోవచ్చన్నారు. అనంతరం ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్యాక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి ట్రై సైకిల్ వితరణ



దివ్యాంగురాలికి అందజేస్తున్న ట్రై సైకిల్

కావలి, ఫిబ్రవరి 2: దివ్యాంగురాలు పీ.వెంకటలక్ష్మికి సక్షం సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పాతూరు కృష్ణమందిరం వద్ద శుక్రవారం రియల్టర్ జనిగర్ల మహేంద్రయాదవ్ మూడు చక్రాల సైకిల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సక్షం సంస్థ ప్రతినిధులు డాక్టర్ కే.మాధవరెడ్డి, నాగమణి, మంగళగిరి వేణుగోపాల్, మాజీ కౌన్సిలర్ పొనుగోటి అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్య నాయుడును కలిసిన భరత్‌కుమార్



వెంకయ్యనాయుడుకి కృష్ణుడి బొమ్మ అందజేస్తున్న భరత్‌కుమార్

కావలి, ఫిబ్రవరి 2: భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడికి పద్మవిభూషణ్ అవార్డు వచ్చిన సందర్భంగా శుక్రవారం హైద్రాబాద్‌లోని ఆయన నివాసంలో బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు జీ.భరత్‌కుమార్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భరత్‌కుమార్ యాదవ్ తాను వెంకయ్య నాయుడిని కలవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

దోచుకుని దాచుకోవడమే మంత్రి కాకాణి పని

● మాజీ మంత్రి సోమిరెడ్డి

వెంకటాచలం, ఫిబ్రవరి 2 : దోచుకుని దాచుకోవడమే వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పని అని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శిం చారు. మండలంలోని సర్వేపల్లి రిజర్వాయ ర్‌ను శుక్రవారం ఆయన రైతులు, ఆ పార్టీ నాయ కులతో కలిసి పరిశీలించారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో నాసిరకం పనులతో సర్వేపల్లి రిజర్వాయర్ పరిస్థితి దారుణంగా తయా రైందన్నారు. టీడీపీ హయాంలో నాగం జనార్ధన్‌రెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు 61 గ్రామా లకు గ్రామీణ సురక్షిత మంచినీటి పథకాన్ని తాను మంజూరు చేయిస్తే నేడు ఆ పథ కాన్ని కూడా మూయించిన ఘనత కాకాణి దేన న్నారు. రిజర్వాయర్‌లో నీరు లేకుండా చేసి భారీ గోతులు తవ్వి ఎర్రమట్టిని పెద్దఎత్తున అక్రమంగా తరలించుకొని దోచుకున్నాడన్నారు. సర్వేపల్లి రిజర్వాయర్, కనుపూరు, కోడూరు ఇలా అన్ని చెరువులను సర్వనాశనం చేశారని మండిపడ్డారు.



సర్వేపల్లి రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న సోమిరెడ్డి

● ఆయనకు వ్యవసాయం అంటేనే తెలియదు

వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి వ్యవ సాయం అంటేనే తెలియదని మాజీ మంత్రి సోమి రెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. మండలం లోని ఇస్కపాళెం, పుంజులూరుపాడు గ్రామాల్లో శుక్ర వారం సాయంత్రం జరిగిన బాబు షూరిటీ - భవి ష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని కర పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రాజా యాదవ్, రాధాకృష్ణమనాయుడు, మురళీధర్‌రెడ్డి, సురేష్‌నా యుడు, నాగార్జున్‌రెడ్డి, పద్మనాభ నాయుడు, వెంకట సుబ్బయ్య, బాబుల్ రెడ్డి, కే సురేష్, వెంకటకృష్ణనా యుడు, మల్లికార్జున్‌రెడ్డి, చక్రధర్ తదితరులున్నారు.

కాజ్‌వే నిర్మాణ పనులు ప్రారంభం

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 2 : మండలంలోని ముదువర్తిపాలెం సబ్‌మెర్సిబుల్ కాజ్‌వే నిర్మాణ పనులను కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి శుక్రవారం ప్రారం భించారు. రూ.93.32 లక్షలతో కాజ్‌వే పనులు జరుగుతా యని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరి చలపతి, మావులూరు శ్రీనివాసులురెడ్డి, దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, గొల్ల పల్లి విజయ్‌కుమార్, కైలాసం శ్రీనివాసులురెడ్డి, కాంట్రాక్టర్ ఆర్‌కేఎస్ ప్రాజెక్టు రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ కార్డులకు ఈకేవైసీ పూర్తిచేయాలి

మనుబోలు, ఫిబ్రవరి 2: ఆయుష్మాన్ భారత్ పథకం కింద జారీచేసిన హెల్త్ కార్డులకు ఈకేవైసీ పూర్తిచేయాలని డీఎల్‌డీవో వసుమతి సూచించారు. స్థానిక మండల పరి షత్ కార్యాలయంలో శుక్రవారం ఆమె వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఇప్పటికి 11313 మందికి మాత్రమే హెల్త్ కార్డులు జారీ చేశామన్నారు. వీటిలో 6256 కార్డులకు మాత్రమే ఈకేవైసీ చేశారని, మిగిలిన కార్డులకు ఈకేవైసీ తప్పనిసరిగా చేయాలని ఆమె సిబ్బం దికి సూచించారు. ఈకేవైసీ చేయకపోతే కార్డు వలన ప్ర యోజనం ఉండదన్నారు. ఈవిషయాన్ని ప్రజలకు అవగా హన కల్పించి త్వరగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో జీవీఎస్‌వి ప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధికి చిరునామాగా సర్వేపల్లి : మంత్రి కాకాణి

ముత్తుకూరు, ఫిబ్రవరి 2 : సర్వేపల్లి నియోజకవ ర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా మార్చామని రాష్ట్ర వ్యవ సాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్ర వారం ముత్తుకూరు గ్రామంలో నిర్మించిన ఫిష్ మార్కెట్, గ్రామ సచివాలయం, అంతర్గత సిమెంటు రోడ్లు, సైడ్ కాలువలు, ముస్లిం శ్మశాన వాటిక ప్రహరీగోడ నిర్మాణం, శరత్ రాయల్ స్కేటింగ్ అకాడమీని మంత్రి కాకాణి ప్రా రంభించారు. అనంతరం లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టా లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయ కులు మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, ఈదూరు రామమోహన్‌రెడ్డి, కాకుటూరు లక్ష్మణరెడ్డి, మునుకూరు రవికుమార్‌రెడ్డి, రాగాల వెంకటేశ్వర్లు, ఎంపీపీ సుగుణ, తహసీల్దారు బాలకృష్ణారెడ్డి, ఎంపీడీవో లక్ష్మణ కుమార్, పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలి

పొదలకూరు, ఫిబ్రవరి 2: మండలంలో అనధికార లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరి మల్లికార్జున నాయుడు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల విస్తరణ అధికారి (ఈఓపీఆర్డీ) నరసింహారెడ్డికి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 32 లేఅవుట్లు అనధికారికంగా ఉన్నాయన్నారు. ఈ లేఅవుట్ల ద్వారా పంచాయతీకి రూ.17కోట్లు పన్నుల రూపంలో రావాల్సి ఉందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న లేఅవుట్లలోని ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు ఆపేయాలని డిమాండ్ చేశారు. అలాగే మండలంలోని మరుపూరు, బిరదవోలు, చాటగొట్ల, చిట్టేపల్లి తిప్పల వద్ద అధికార పార్టీ నాయకులు గత 15 రోజులుగా విచ్చలవిడిగా గ్రావెల్ అమ్మకాలు సాగిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, అక్కెం సుధాకర్‌రెడ్డి, బక్కయ్య నాయుడు, బోగోలు భాస్కర్‌రెడ్డి, వెన్నపూస రాజశేఖర్‌రెడ్డి, ఆదాల మురళీ, మధు, గంటా మల్లికార్జున్‌యాదవ్, చిరంజీవి, వెంకటరమణయ్య, పి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



ఈఓపీఆర్డీకి వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌కు మనుబోలు విద్యార్థిని ప్రాజెక్టు ఎంపిక

మనుబోలు, ఫిబ్రవరి 2: రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌కు మనుబోలు విద్యార్థిని గమనిక చేసిన ప్రాజెక్టు ఎం పికైనట్లు మనుబోలు బాలికల పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు వసంత కుమారి తెలిపారు. శుక్రవారం ఆమె పాఠశాలలో విద్యార్థిని గమనికను అభినందిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండ లంలోని 7 ఉన్నత పాఠశాలల నుంచి వెళ్లిన ప్రాజె క్టులలో కేవలం గమనిక చేసిన లేజర్ సెక్యూరిటీ ఫర్ డోర్స్ అనే ప్రాజెక్టు ఎంపికైందన్నారు. ప్రాజెక్టు తయారీలో విద్యార్థినికి గైడ్‌గా వ్యవహరించిన ఉపా ధ్యాయిని సువర్ణను అభినందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు వసంతకుమారి

ఎన్నిసార్లు శంకుస్థాపన చేస్తారు?

కోవూరు, ఫిబ్రవరి 2 : ముదివర్తి - ముదివర్తిపాలెం కాజ్‌వే నిర్మాణం కోసం శుక్రవారం శంకుస్థాపన చేసిన ప్రసన్నకుమార్‌రెడ్డి ఎన్నో పర్యాయం శంకుస్థాపన చేశారో చెప్పాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. పడుగుపాడులో శుక్రవారం నిర్వహించిన ప్రతి అడగు ప్రజల కోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బ్రిడ్జి నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, అభివృద్ధి పనులు ఎవరు చేసినా స్వాగతమిస్తామన్నారు. అభి వృద్ధి పేరుతో చేస్తున్న అవినీతి, మోసాన్ని మాత్రం కచ్చితంగా ప్రశ్నిస్తామన్నారు. ఐదేళ్ల కాలంలో మలిదేవి ఆధునీకరణ పనులు చేయలేని ఎమ్మెల్యే రెండు నెలల్లో కాజ్‌వే ఎలా పూర్తి చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు కట్టి ఎన్నికల్లో ఓట్లు అడుగుతానని వాగ్దానం చేసిన ఆయన నేడు పూజ చేసి కాజ్‌వే నిర్మించినట్లు గ్రాఫిక్స్ చూపిస్తూ మరో సారి ప్రజలను మోసం చేస్తున్నారని వివరించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం జన్మభూమి రుణం తీసుకోవడం కోసం నిరంతరం అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఇంతా మల్లారెడ్డి, చెముకుల కృష్ణచైతన్య, పామంచి వంశీ, దిలీప్, షేక్.అమీర్, చిన్నంగారి శీనయ్య, రహీం, పఠాన్ నజీర్‌బాషా, నాటకరాణి శ్రీకాంత్, బెల్లంకొండ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



మహిళతో మాట్లాడుతున్న దినేష్‌రెడ్డి

● టీడీపీలో చేరిక

స్థానిక నేతాజీ నగర్‌కు చెందిన గంగవరపు రవి చంద్ర నాయుడు ఆధ్వర్యంలో పోలంరెడ్డి దినేష్‌రెడ్డి సమక్షంలో 50 మంది టీడీపీలో చేరారు. వారిలో చెంబేటి పెంచలయ్య, సయ్యద్ మసూద్అహ్మద్, చెంబేటి చిన్నయ్య, బత్తల రమేష్, అమర్, తదితరులు ఉన్నారు.

ప్రకటన

నా క్లయింట్ అయిన మేదరమెట్ల సురేష్ నాయుడు తండ్రి చెంచురామయ్య, డోరు నెం.5-189రు, కెకె. కాలని, బుజబుజనెల్లూరు, నెల్లూరు-524004 అనువారు ఇచ్చిన వివరముల మేరకు యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా:- నా క్లయింట్ నెల్లూరు మునిసిపల్ కార్పోరేషన్‌లో చేరిన, వేదాయపాళెం గ్రామంలోని సర్వే నెం.72/2రు మునిసిపల్ వారు నెం.28-1-రు, డోరు నెం. 1562రుకు సమీపములోని నెం.6రు ప్లాటు విస్తీర్ణం 27 అంకణములు స్థలమున్నా చేరెడ్డి రఘురామిరెడ్డి తండ్రి లేట్ శంకరారెడ్డి అనువారి వద్ద నుండి రిజిష్టర్డు విక్రయపత్రం తేది:20-01-2024 డాక్యుమెంటు నెం. 636/2024 ద్వారా కొనుగోలు చేసినారు. సదరు డాక్యుమెంటుకు సంబంధించిన లింకు డాక్యుమెంట్లలో ఒకటైన రిజిష్టర్డు విక్రయపత్రం తేది:06-02-1984 డాక్యుమెంటు నెం. 635/1984 (RO, నెల్లూరు)రును జెరాక్స్ తీసుకొను నిమిత్తం తే.27-01-2024దిన నా క్లయింట్ తన ఇంటి వద్ద నుండి అయ్యప్పగుడి సెంటర్‌లో వున్న జెరాక్స్ షాపుకు పోవుచుండగా మార్గమధ్యములో జారిపడి పోయినది. సదరు ఒరిజినల్ లింకు డాక్యుమెంట్ నెం.635/ 1984రు ఎవ్వరికైనను దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సుకు తెచ్చి ఇచ్చిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును. సదరు ఒరిజినల్ లింకు డాక్యుమెంటును ఉపయోగించి ఎవ్వరైనా ఎట్టి లావాదేవీలు జరిపిన అవి చెల్లనేరవు. అవి నా క్లయింట్‌ను బద్ధగించవు.

షేక్ జావీద్, B.Com., L.L.B., అడ్వకేట్, అంబేద్కర్‌నగర్, నెల్లూరు క్లబ్ ప్రక్కన, నెల్లూరు-524 003. సెల్: 70137 56432

జనరల్ నోటీసు

నా క్లయింట్ అయిన పేరిచెర్ల సుధీర్ తండ్రి శ్రీనివాసులు, మాగుంట లేఅవుట్, నెల్లూరుసిటి అనువారు ఇచ్చిన అనుమతి మేరకు యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా:- నా క్లయింట్ ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని శ్రీమతి దామరాజు శ్రీలక్ష్మి W/o. వెంకట సుబ్బారావు, ఇబ్రహీంపట్నం, కృష్ణాజిల్లా అనువారి వద్ద నుండి కొనుగోలు చేయుటకు నిర్ణయించుకొనినారు. సదరు శ్రీలక్ష్మి గారు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని శ్రీదుర్గా రియల్ ఎస్టేట్స్, నెల్లూరు వారి వద్ద నుండి రిజిష్టర్డు విక్రయపత్రం తే.26-02-1988 డాక్యుమెంటు నెం.1525/1988 మరియు రిజిష్టర్డు సవరణ పత్రం తేది: 27-02-2013 డాక్యుమెంటు నెం.1710/2013 ద్వారా కొనుగోలు చేసినారని చెప్పుచున్నారు. మరియు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి పరాధీనములు, అడుమానములు, జప్తులు, అగ్రిమెంట్లు, లీజులు, క్లయిమ్స్, కోర్టు వ్యవహారములు లేవని చెప్పుచున్నారు. కావున క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవ్వరికేని ఎటువంటి ఆక్షేపణలు ఉన్న ఈ పత్రికా ప్రకటన వెలువడిన తేది నుండి 7 రోజుల లోపల ఈ క్రింది అడ్రస్సుకు లిఖితపూర్వకముగా సరియగు ఆధారములతో తెలుపుకోవలసినది. తదుపరి వచ్చు ఆక్షేపణలు నా క్లయింట్‌ను బద్ధగించవు.

అస్తి షెడ్యూలు

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు రి.డి. యిలాకా నెల్లూరు సబ్.లో చేరిన నెల్లూరు మునిసిపల్ కార్పోరేషన్‌లో చేరిన నెల్లూరు నగరం, పడారుపల్లి ఏరియాలోని సర్వే నెం.32/1, 32/2, 33/1, 33/2, 33/3, 39/1, 39/2, 39/3, 39/4, 40/1, 40/2 ల్లు భూమి లేఅవుట్ చేయబడి అప్రూవ్ చేయబడిన ప్లాను దాఖలా "ఎ-1"బ్లాక్‌ప్లాట్లులో నెం.16రు ప్లాటు విస్తీర్ణం 33 1/3 అంకణములు లేక 222.969 చ.మీ. స్థలమునకు హద్దులు: తూర్పు: నెం.47రు ప్లాటు, దక్షిణం: లేఅవుట్ రోడ్డు, పడమర: లేఅవుట్ రోడ్డు, ఉత్తరం: నెం.15రు ప్లాటు.

పెనుబాక గంగాధరరెడ్డి, B.Com., B.L., అడ్వకేట్, రమేష్‌రెడ్డినగర్, నెల్లూరు-3. సెల్: 98493 49333

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

● వీఎస్‌యూ వీసీ సుందరవల్లి

వెంకటాచలం, ఫిబ్రవరి 2: ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వీఎస్‌యూ వీసీ సుందరవల్లి అన్నారు. శుక్రవారం కాకుటూరు వద్ద ఉన్న యూనివర్సిటీలో ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్‌డే క్యాంపులో పాల్గొన్న ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లను ఆమె అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రా రెడ్డి, వర్సిటీ ప్రిన్సిపాల్ విజయానంద్‌కుమార్‌బాబు, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, డాక్టర్ కే సునీత, డాక్టర్ కే విద్యా ప్రభాకర్ తదితరులున్నారు.



వలంటీర్లను అభినందిస్తున్న వీసీ సుందరవల్లి

మార్చి 1లోపు దరఖాస్తు చేసుకోవాలి

విక్రమ సింహపురి యూనివర్సిటీ 8, 9వ స్నాతకోత్సవ మహోత్సవాన్ని త్వరలో నిర్వహించు టకు వర్సిటీ అధికారులు నిర్ణయించారని వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ, పీజీ కళాశాలల్లో 2021 -22 ఏడాదికి గాను, అంతకు పూర్వం డిగ్రీ, పీజీ పూర్తి చేసిన విద్యార్థులందరూ మార్చి 1వ తేదీ లోపు యూని వర్సిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే విధానం, ఇతర వివరాలకు విద్యార్థులు వారి వారి కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలని, స్నాతకోత్సవ మహోత్సవ నిర్దేశిత తేదీని వర్సిటీ త్వరలోనే తెలియజేస్తుందన్నారు.

జేబుదొంగకు దేహశుద్ధి

రాపూరు(డక్కిలి), ఫిబ్రవరి 2: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాపూరు మండలం తాతిపల్లి గ్రామంలో భువనేశ్వరి పర్యటనలో జేబు దొంగలు హల్‌చల్ చేశారు. ఓ జేబుదొంగ వెంకటగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు జేబులో నుంచి రూ. 2500 నగదు కొట్టేశాడు. దీంతో పక్కనున్న వారు గమనించి వారించడంతో ఆ దొంగ అక్కడ నుంచి పరుగు తీయడంతో అతన్ని వెంబడించి పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పచెప్పారు. కాగా, మరో నలుగురైదుగురు తమ జేబులో డబ్బులు కూడా కనిపించడం లేదని తెలపడంతో పట్టుబడిన దొంగ జేబుల్లో పరిశీలించగా ఎలాంటి నగదు లభ్యం కాలేదని తెలిసింది.



జేబు దొంగకు దేహశుద్ధి చేస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ రాజేశ్వరరావు

టెండర్ ప్రకటన

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము దేవాదాయ ధర్మదాయ శాఖ, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా.

శ్రీ రామ మందిరం - విరువూరు గ్రామము, పొదలకూరు మండలం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా.


పై దేవస్థానము పునః నిర్మాణము చేయుటకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలిచి వున్నారు. ఆసక్తి కలిగిన వారు క్రింది వెబ్‌సైటు నందు టెండరు వివరములు కొరకు చూడవచ్చును.

వెబ్‌సైటు అడ్రస్ https://tender.apeprocurement.gov.in// అను వెబ్ సైటు నందు టెండర్ వివరములు చూడవచ్చును.

ఇట్లు: కుడారి పెంచల వరప్రసాద్ కార్యనిర్వహణాధికారి

ఇక్కడ అంతా నేనే..!

● ప్లానింగ్, ఇంటి పన్ను, కొళాయి కనెక్షన్ కలిపి ప్యాకేజీ



మీరు కట్టుకునే ఇంటికి ప్లానింగ్ అప్రూవల్ ఇచ్చే బాధ్యత నాదే... ఇల్లు పూర్తయ్యాక ఇంటి పన్ను వేయించేది నేనే.... ఆ తరువాత కొళాయి కనెక్షన్ కూడా నేనే ఇప్పిస్తా....! వీటన్నిటికీ కలిపి ఒకే ప్యాకేజీ కింద డబ్బులివ్వండి. మొత్తం నేనే చూసుకుంటా. మీరు ఎక్కడికీ వెళ్లాల్సిన పనిలేదు, ఎవరినీ కలవాల్సిన అవసరం లేదు.... !

ఇదీ కార్పొరేషన్ మేయర్ పోట్లూరి స్రవంతి ప్రాతినిధ్యం వహిస్తున్న 12వ డివిజన్‌లో జరుగుతున్న ఆర్థిక దందా. ఈ ప్రాంతంలో ఓ సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ డాన్ అవతార మెత్తాడు. కొత్తగా నిర్మించే ఇళ్ల వద్దకు వెళ్లి ప్లానింగ్ నుంచి ఇంటి పన్ను, ఆపై కొళాయి కనెక్షన్, విద్యుత్ మీటరు, ఇతర సౌకర్యాలన్నిటికీ కలిపి ప్యాకేజీ కింద నగదు వసూలు చేస్తున్నాడు. మీరు కాలు తీసి బయట పెట్టకుండా అన్నీ మీ వద్దకే సమకూర్చుతానని భరోసా ఇస్తున్నాడు. దీంతో అటు బిల్డర్లు, ఇటు ఇంటి నిర్మాణదారులు అతనికే పనులు పురమాయిస్తున్నారు. ఎవరైనా సదరు వ్యక్తిని కాదని మరొకరి చేత పనులు చేయించినా, కాదని బదులిచ్చినా ఇక అంతే సంగతులు. రకరకాల కొర్రీలు పెట్టి ఇంటి నిర్మాణం ఆపేసే దుస్థితికి తీసుకువస్తున్నాడు. ప్రస్తుతం నెల్లూరులో శరవేగంగా ఇళ్ల నిర్మాణం జరుగుతున్న ప్రాంతాల్లో 12వ డివిజన్ ఒకటి. ఇక్కడే ఇలాంటి దందా బయటపడటం, అందులోనూ మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్ కావడంతో చర్చనీయాంశంగా మారింది.

- నెల్లూరు రూరల్

నెల్లూరులో తంతే నరసరావుపేటలో పడ్డావు!

● ఎమ్మెల్యే అనిల్‌పై కోటంరెడ్డి

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 2 : నెల్లూరులో తంతే నరసరావుపేటలో పడ్డావు... నీవా నారాయణ చేసిన అభివృద్ధిని విమర్శించేది అంటూ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం నగరంలో టీడీపీ ఏర్పాటు ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమాల్లో ఆయన ప్రసంగించారు. నెల్లూరు సిటీలో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అనిల్ ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేయలేదన్నారు. ప్రజలు, స్వంత పార్టీ నేతల నుంచి చెడ్డపేరు తెచ్చుకుని రాజకీయ జీవితాని కి శుభం కార్డు వేసుకున్నారని ఎద్దేవా చేశారు. ఈ నేప థ్యంలో టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణకు సరైన ప్రత్యర్థిని నిలపలేక వైసీపీ నేతలు తలలు పట్టుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు, సత్యనారాయణ, ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కప్పిర శ్రీనివాసులు, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు తిరుమల నాయుడు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి

సెప్సిస్‌తో అవయవాలకు హాని

● ఐఎస్‌సీసీఎం చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 2 : సెప్సిస్ అనే ఆరోగ్య సమస్య అవయవాలకు హాని కలిగించి ఇన్‌ఫెక్షన్‌కు దారితీస్తుందని ఇండియన్ సొసైటీ క్రిటికల్ కేర్ మెడిసిన్ (ఐఎస్‌సీసీఎం) జిల్లా చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ వెల్లడించారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో సెప్సిస్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ సెప్సిస్ ఎవరిపై నైనా ప్రభావితం చూపిస్తుందని, ప్రధానంగా వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారిపై ప్రభావం చూపుతుందని తెలియచేశారు. సొసైటీ కార్యదర్శి డాక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం 47 నుంచి 50 మిలియన్ల మంది సెప్సిస్‌కు గురవుతున్నారన్నారు. ప్రపంచంలో సంభవించే 5 మరణాల్లో ఒకటి సెప్సిస్ వల్లే ఉంటుందని వెల్లడించారు. వీరిలో 40 శాతం మంది ఐదేళ్లలోపు చిన్నారులేనని తెలిపారు. సెప్సిస్ కలిగిన వారికి వేగవంతంగా గుండె కొట్టుకోవటం, ఒంటినొప్పులు వస్తాయన్నారు. దీని నివారణకు వెంటనే యాంటీ బయోటిక్స్, ఫ్లూయిడ్స్, వ్యాక్సిన్ వినియోగించాలన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ సతీష్, డాక్టర్ దినకర్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న వైద్య నిపుణులు

జీజీహెచ్‌లో అత్యవసర విభాగానికి విరాళం

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 2 : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని అత్యవసర విభాగానికి ఓ దాత విరాళం అందజేశారు. నగరంలోని ఆదిత్యనగర్‌కు చెందిన బిజ్జువేముల చెంచు రెడ్డి 13వ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు ఆసుపత్రికి 10 వీల్‌చైర్లు, 6 స్ట్రెచర్లను శుక్రవారం అందించారు. బాధితుల కుటుంబ సభ్యులు రమాణారెడ్డి, భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తమ తండ్రి వర్ధం తిని పురస్కరించుకుని ఏటా సేవాకార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనల మేరకు ఈ వస్తువులను ఆసుపత్రికి అందించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ లక్ష్మీసునంద, ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మస్తాన్‌బాషా, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కళారాణి, డాక్టర్ గంగాదర్, దాతల కుటుంబ సభ్యు లు కౌషిక్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రికి పరికరాలు అందిస్తున్న దాతలు


మంచినీటి పైపులైను మార్చండి


● డ్రైనేజీ కాలువలో మునిసిపల్ నీటి పైపు

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 2 : నగరంలోని ఆటోనగర్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ మైనార్టీ బాలుర పాఠశాలకు మంచినీటిని సరఫరా చేసే మునిపల్ పైపు లైను డ్రైనేజీ కాలువలో ఉంది. ఆ పైపు లైన్ లీక్ అవుతుండటంతో విద్యార్థులు ప్లాస్టిక్ కవర్లు చుట్టి లీకేజీని అరికట్టేందుకు ప్రయత్నించారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో ఆ నీటిని విద్యార్థులు తాగటం మానేశారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లటంతో మినరల్ వాటర్ క్యాన్ల ద్వారా విద్యార్థులకు మంచినీటిని అందిస్తున్నారు. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి ఉందంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ పాఠశాలలోని విద్యార్థులకు రోజుకు 30కి పైబడి క్యాన్లు అవసరం ఉన్నట్లు సమాచారం. అయితే అరకొరగా లభిస్తున్న నీటితో విద్యార్థులు గొంతు తడుపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పైగా ఈ నీటి కోసం నెలకు రూ.10వేలకు పైగానే ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా మినరల్ వాటర్ క్యాన్ల సరఫరాకు సంబంధించి పెట్టిన బిల్లులు కూడా మంజూరు కాలేదని తెలిసింది.

సొంత భవనానికి ఎప్పుడో..?

మైనార్టీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో 260 మంది విద్యార్థులున్నారు. ప్రస్తుతం అద్దె భవనంలో పాఠశాల నడుస్తోంది. అద్దె కూడా రూ.లక్షకు పైబడే ఉన్నట్లు సమాచారం. ఈ గురుకులానికి నగర శివార్లలోని అక్కచెరువుపాడులో శాశ్వత భవన నిర్మాణాన్ని గత ప్రభుత్వం ప్రారంభించింది. చాలా వరకు నిర్మాణం పూర్తయినప్పటికీ మిగిలిన పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. అది ఎప్పటికి పూర్తవుతోంది చెప్పలేని పరిస్థితి. ఈ క్రమంలో విద్యార్థులు స్వంత భవంతికి వెళ్లలేక, అద్దె భవంతిలో మంచి నీటి సమస్యతో ఉండలేక సతమతమవుతున్నారు. నగర పాలక సంస్థ తక్షణం స్పందించి విద్యార్థులకు తాగునీటి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది.





కాలువలో పైపులైనను చూస్తున్న విద్యార్థులు, మురుగు మధ్య నీటి పైపులైను

హస్త కళల అభివృద్ధి పథకాలను వివరించండి? : వేమిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 2 : హస్తకళల అభివృద్ధికి చేపట్టిన పథకాలను వివరించాలని పార్లమెంటులో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇందుకు కేంద్ర జౌళి శాఖ సహాయ మంత్రి దర్శన జర్దోష్ సమాధానమిస్తూ ఎన్‌హెచ్‌డీపీ, సీహెచ్‌డీపీ పథకాల కింద హస్త కళాకారులు, హస్తకళల అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. 2022-23లో ఆంధ్రప్రదేశ్‌లో హస్తకళల అభివృద్ధికి ఒక మెగా క్లస్టర్ ప్రాజెక్టు మంజూరైందని వివరించారు.

దోమల నివారణ చర్యలు : కమిషనర్



ఫాగింగ్ యంత్రాలను పరిశీలిస్తున్న కమిషనర్ వికాస్

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 2 : నగరంలో దోమల నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ తెలిపారు. శుక్రవారం నూతన ఫాగింగ్ యంత్రాలను కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 54 డివిజన్లలో దోమల మందును పిచికారీ చేయిస్తున్నామని తెలిపారు. వీటితోపాటు రెండు భారీ ఫాగింగ్ యంత్రాలను ఉపయోగిస్తున్నట్లు పేర్కొన్నారు. యంత్రాలు వెళ్లలేని వీధుల్లోకి చిన్న మిషన్ల ద్వారా పొగను పంపి పెరిగిన పెద్ద దోమలను నిలువరిస్తున్నట్లు వెల్లడించారు. లార్వా దశలోనే దోమల వ్యాప్తిని అడ్డుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం పలు విభాగాల అధికారులతో కుల గణనపై డివిజన్ల వారీగా కమిషనర్ సమీక్ష నిర్వహించారు. శనివారంలోపు కులగణన ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు.

ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే మూల్యం చెల్లించాలి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 2 : ఆరోగ్యమే మహాభాగ్యం అని పెద్దలు అన్నారని, అలాంటి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని యామిని న్యూరో కేర్ హాస్పిటల్ అధినేతలు డాక్టర్ యామిని, డాక్టర్ హర్షవర్ధన్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం జర్నలిస్టు భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. మానవ శరీరం యంత్రంలాంటిదని, ప్రతిరోజు పరిరక్షించుకోవాలన్నారు. లేకుంటే వ్యాధులకు మూలకారణం అవుతుందన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 2 : నగరంలోని బాబు జగజ్జీవన్‌రామ్ నగర్‌లో పలు అభివృద్ధి పనులకు ఎంపీ, రూరల్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. 23వ డివిజన్‌లో రూ.9.70కోట్లతో అభివృద్ధి పనులు చేయిస్తున్నామని చెప్పారు. దోమల నివారణకు స్థానిక కార్పొరేటర్ శ్రీనివాసులు రెడ్డి సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఫాగింగ్ మిషన్‌ను ఆదాల ప్రారంభించారు.

హెల్మెట్‌తో ప్రాణ రక్షణ : ఎంవీఐ



రహదారి భద్రత మాసోత్సవాల్లో రవాణా శాఖ అధికారులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 2: మోటార్ సైకిల్‌పై ప్రయాణం చేసే వారు హెల్మెట్ ధరించి ప్రాణ రక్షణ పొందాలని మోటార్ వాహన తనిఖీ అధికారి (ఎంవీఐ) గోపీనాయక్ పిలుపునిచ్చారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా నగరంలోని గొలగమూడి రోడ్డు వద్ద జాతీయ రహదారి సమీపంలో రవాణా శాఖ అధికారులు హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారిని ఆపి వారికి హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు రాంబాబు, కార్తీక్ పవన్‌కుమార్, పూర్ణచంద్రరావు, స్వప్నిల్ రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం	9985411424
నెల్లూరు ఏసీవో	9542727676
నెల్లూరు సిటీ	8179815202
నెల్లూరు రూరల్	8885688410
కోవూరు	8008894200

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 అనుసంధాన పనులు షురూ


ఇన్‌శాట్-త్రీడీ ఉపగ్రహం

శ్రీహరికోటలోని షార్‌లో జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ ప్రయోగానికి సంబంధించిన పనులు శరవేగంగా సాగుతున్నాయి.ఈ ఏడాది తొలి రోజు ప్రయోగించిన పీఎస్ఎల్వీ-సీ 58 రాకెట్ ద్వారా ఎక్స్‌పోశాట్ ఉపగ్రహాన్ని విజయవంతంగా పంపారు. ఇదే ఉత్సాహంతో శాస్త్రవేత్తలు ఈ నెల 17న జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ ద్వారా ఇన్‌శాట్-త్రీడీ ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపనున్నారు. ఇందులో అత్యాధునిక 19 పేలోడ్‌లను కూడా పంపుతున్నారు.షార్‌లోని రెండో ప్రయోగ వేదిక వద్ద ఇప్పటికే రెండు దశల అనుసంధాన పనులు పూర్తి కాగా మూడవ దశ పనులు జరుగుతున్నారు.గత నెల 27న బెంగళూరులోని ఉపగ్రహ తయారీ కేంద్రం నుంచి ఇన్‌శాట్-త్రీడీ ఉపగ్రహాన్ని షార్‌కు తీసుకొచ్చారు. క్లీన్‌రూమ్‌లో ఉపగ్రహాన్ని పెట్టి తుది పరీక్షలు నిర్వహించారు.దీన్ని హీట్‌షీల్డ్‌లో అమర్చి రాకెట్ శిఖర భాగాన అనుసంధానిస్తారు. 2275 కిలోల బరువు గల ఇన్‌శాట్-త్రీడీ ఉపగ్రహం ద్వారా వాతావరణ పరిస్థితుల అంచనాతో పాటు విపత్తుల హెచ్చరికలను తెలుసుకోవచ్చు.

- సూళ్లూరుపేట



ముక్కంటి సేవలో రష్యన్లు

రాహు కేతు పూజల్లో రష్యన్ భక్తులు

శ్రీకాళహస్తీశ్వర స్వామిని శుక్రవారం 30మంది రష్యన్లు దర్శించుకున్నారు.అంతకు ముందు ఆలయంలోని రాయలవారి మండపంలో రాహు-కేతు సర్ప దోష నివారణ పూజలు జరిపించుకున్నారు.దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితుల ఆశీర్వాదం పొందారు. అనంతరం ఆలయంలోని పొగడ చెట్టు వద్ద శివనామస్మరణ చేశారు.ముక్కంటి ఆలయ శిల్ప సౌందర్యం ఆకట్టుకుందని తెలిపారు.

-శ్రీకాళహస్తి

ఒకే ఇంట్లో 32 ఓట్లు !




తిరుపతి నగరం 33వ డివిజన్లో వున్న అబ్బన్న కాలనీ ప్రాంతంలోని 124వ పోలింగ్ బూత్‌లో ఒకే ఇంటి చిరునామాతో ఏకంగా 32 ఓట్లు బయటపడ్డాయి. డోర్ నెంబరు 18-39ఎస్4-407 గల ఆ ఇల్లు నిజానికి ఓ చిన్న బెడ్ రూమ్ వున్న ఇల్లు.పైగా ఈ ఇంటి చిరునామాలో వున్న 32మంది ఓటర్లు ఈ ప్రాంతానికే చెందినవారు కాదని 33వ వార్డు టీడీపీ అధ్యక్షుడు రాజేంద్ర చెప్పారు. ఈ 32 ఓట్లను దొంగ ఓట్లుగా గుర్తించి తొలగించాలని నగరపాలకసంస్థ కమిషనర్,ఈఆర్వో హరితకు పలు మార్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. బీఎల్వోలను పంపి విచారణ చేయిస్తామని చెప్పారే కానీ వాస్తవంగా పట్టించుకోనే లేదన్నారు.కలెక్టర్ అయినా స్పందించి ఇలాంటి దొంగ ఓట్లు ఇంకా ఎక్కడెక్కడ వున్నాయో గుర్తించి తొలగించాలని ఆయన మీడియా సమావేశంలో విజ్ఞప్తి చేశారు.

- తిరుపతి(తిలక్‌రోడ్)

వైసీపీ రివర్స్ గేర్

- నారాయణస్వామి జీడీనెల్లూరుకే
- రెడ్డప్ప చిత్తూరు పార్లమెంటుకే
- ఇద్దరికీ మళ్లీ పాత స్థానాలే
- పోటీకి ఇద్దరూ విముఖత చూపడంతోనే ఈ నిర్ణయం?




చిత్తూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎంపీ, జీడీనెల్లూరు అసెంబ్లీ ఇన్‌చార్జుల ప్రకటన విషయంలో వైసీపీ అధిష్ఠానం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. నాలుగో జాబితాలో ప్రకటించిన పేర్లను.. శుక్రవారం విడుదల చేసిన ఆరో జాబితాలో మార్చేసింది. నారాయణస్వామి నేరుగా సీఎం జగన్‌ను కలిసి మరో అవకాశం కోసం అభ్యర్థించడం, ఆయన వర్గం నుంచి తీవ్ర అసమ్మతి రాగం వినిపించడం కారణాలుగా తెలుస్తున్నాయి. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో తిరుపతి లోక్‌సభ ఇన్‌చార్జిగా ఎంపీ గురుమూర్తిని రీబ్యాక్ చేయడం.. సత్యవేడు ఇన్‌చార్జిని మార్చిన విషయం తెలిసిందే.

డిప్యూటీ సీఎం నారాయణస్వామికి సొంత నియోజకవర్గం జీడీనెల్లూరులో గట్టి వ్యతిరేక వర్గం ఉన్న విషయం తెలిసిందే. జ్ఞానేంద్రరెడ్డి, దయాసాగర్‌రెడ్డి వంటి ఆయన వ్యతిరేకులకు మంత్రి పెద్దిరెడ్డి మద్దతు కూడా ఉండడంతో వారంతా నారాయణస్వామికి వ్యతిరేకంగా గట్టిగా పనిచేశారు. నారాయణస్వామికి టికెట్ ఇస్తే పనిచేసేది లేదని అనేకమార్లు ప్రకటించారు. పెనుమూరు మండలంలో డిప్యూటీసీఎం పర్యటిస్తే అడ్డుకోవడాలు అనేకం ఉన్నాయి. దీంతో అధిష్ఠానం విడుదల చేసిన నాలుగో జాబితాలో నారాయణస్వామికి జీడీనెల్లూరు కాకుండా చిత్తూరు లోక్‌సభ ఇన్‌చార్జిగా అవకాశం కల్పించారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్పను జీడీనెల్లూరు ఇన్‌చార్జిగా ప్రకటించారు. దీంతో నారాయణస్వామి వ్యతిరేకవర్గం తామే గెలిచామంటూ సంబర పడింది. దీనికి దీటుగా నారాయణస్వామి అనుకూలవర్గం నియోజకవర్గంలోని ప్రతి మండలంలోనూ ప్రెస్‌మీట్లు పెట్టి రెడ్డెప్ప అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించింది. ఆయా మండలాల నాయకులు చిత్తూరు, తిరుపతి ప్రెస్‌క్లబ్‌లలోనూ ప్రెస్‌మీట్లు పెట్టి నారాయణస్వామికే మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. దీనికి అనుగుణంగా నారాయణస్వామి కూడా నేరుగా సీఎం జగన్‌ను కలిసి, తనకు మరో అవకాశం కల్పించాలని కోరారు. పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి వంటి నాయకులను నమ్ముకోకుండా నేరుగా సీఎంను కలవడంతోనే ఆయనకు మరో అవకాశం దక్కినట్లు నారాయణస్వామి వర్గీయులు చెబుతున్నారు. జిల్లాను శాసిస్తున్న రెడ్లతో పాటు నియోజకవర్గంలోని రెడ్లను తట్టుకుని, అధిష్ఠాన నిర్ణయాన్ని మార్పించుకోవడంతో నారాయణస్వామి వర్గీయులు సంబర పడుతున్నారు.

● ఇదిలా ఉండగా, ఎంపీ రెడ్డెప్ప కూడా జీడీనెల్లూరు నుంచి పోటీ చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపలేదు. అసెంబ్లీ ఇన్‌చార్జిగా నియమించినా.. ఆయన నియోజకవర్గంలో పర్యటించలేదు. పరిచయాలు పెంచుకోలేదు. ఓ సందర్భంలో చిత్తూరులో ఆయన మాట్లాడుతూ 'సీట్ల సర్దుబాటు విషయంగా నేను స్పందించను. అధిష్ఠానం ఆదేశాల మేరకు నడుచుకుంటాను. పోటీ చేస్తాను. నారాయణస్వామి నాకు మంచి మిత్రుడు' అని చెప్పారు. అంటే తనకు ఫలానా టికెట్ కావాలని ఆయన ఎన్నడూ కోరలేదు.

అధికారపార్టీలో అభద్రతాభావం

ఓసారి ప్రకటించిన ఇన్‌చార్జులను మరోసారి కూడా వైసీపీ అధిష్ఠానం మారుస్తుండడంతో ఆ పార్టీ అభ్యర్థుల్లో ఆందోళన మొదలైందనే చెప్పాలి. ఆది మూలం ఎఫెక్ట్‌తో తిరుపతి లోక్‌సభకు ఎంపీ గురుమూర్తిని వెనక్కి పంపి.. సత్యవేడు అసెంబ్లీకి కొత్త నేతను ఇన్‌చార్జిగా ప్రకటించింది. ఇక, చిత్తూరు ఎంపీ, జీడీనెల్లూరు అసెంబ్లీ ఇన్‌చార్జుల విషయంలో రివర్స్ గేరులో వెళ్లింది. ఈ పరిణామాలతో ఇప్పటికే ఇన్‌చార్జులుగా నియమితులైన వారితో పాటు తమకే సీటు అనుకుంటున్న అభ్యర్థుల్లోనూ అభద్రతాభావం మొదలైంది. ఈ జాబితాలో తమ పేరున్నప్పటికీ, మరో జాబితాలో ఉంటుందా.. ఊడుతుందా అని ఉమ్మడి జిల్లాలోని పలువురు ఆందోళన చెందుతున్నారు.


బాలుడు కిందకు దిగిన మూడవ గోపుర ప్రదేశం


మూడవ గోపురం సమీపంలో ప్రాకారం వద్ద ఉన్న నిచ్చెన


పార్థసారధి రెడ్డిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

ఉలిక్కిపడ్డ శ్రీకాళహస్తి!

- అర్ధరాత్రి ముక్కంటి ఆలయంలో సంచరించిన 14యేళ్ల బాలుడు
- దర్జాగా నిచ్చెన సహాయంతో వేకువజామున వెలుపలకు రాక
- నిఘా వైఫల్యంపై దుమారం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 2: ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో భద్రతా వ్యవస్థ డొల్లతనం బట్టబయలైంది.తొమ్మిదో తరగతి చదివే విద్యార్థి అర్ధరాత్రి ఆలయంలో దర్జాగా సంచరించాడు. తర్వాత పెద్ద నిచ్చెన సహాయంతో ప్రాకారం పైనుంచి దిగి తాపీగా కిందకు వచ్చాడు.

వివరాల్లోకి వెళితే... శ్రీకాళహస్తి శివారు ప్రాంతం సాయిబాబా నగర్‌కు చెందిన గౌరి పట్టణంలోని ఐసీడీఎస్ కేంద్రంలో సూపర్‌వైజర్‌గా పని చేస్తుంటారు. ఆమెకు పార్థసారధి రెడ్డి (14) అనే మానసికంగా పరిణతి చెందని కుమారుడున్నాడు. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. తండ్రి మరణించడంతో అమ్మ,బాబాయ్ పర్యవేక్షణలో విద్యార్థి పెరుగుతున్నాడు. పరీక్షల్లో చూసి రాస్తున్నాడంటూ పాఠశాల సిబ్బంది కుటుంబ సభ్యులకు ఫిర్యాదు చేయడంతో గురువారం సాయంత్రం ఇంట్లో పార్థసారధి రెడ్డిని మందలించారు.ముక్కంటి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల కోసం పెయింటింగ్ పనులు చేస్తున్నారు.అందుకోసం ఆలయ ప్రాకారానికి ఇరువైపులా సారవ కొయ్యలు, నిచ్చెనను ఉంచారు. ఆలయంలోకి పార్థసారధి రెడ్డి ఎప్పుడు ప్రవేశించాడో... ఎలా వెళ్లాడో ఎవ్వరూ గుర్తించలేదు.అర్ధరాత్రి ఆలయంలో సంచరించాడు.శుక్రవారం వేకువజామున మూడు గంటల సమయంలో బయటకు వెళ్లేందుకు ప్రయత్నించాడు. మొదట రూ.750రాహు కేతు సర్పదోష నివారణ పూజా మండపం పైకి ఎక్కాడు.అక్కడికి సమీపంలో ఉన్న నిచ్చెనను తీసుకున్నాడు. ఆలయ మూడో గోపురం పక్కనే ప్రాకారం నుంచి నిచ్చెన అనువుగా ఏర్పాటు చేసుకుని కిందకు దిగాడు. సన్నిధి వీధిలో వున్న ఓ లాడ్జిలో పని చేసే యువకుడు ఆలయం నుంచి పార్థసారధి రెడ్డి బయటకు రావడం గుర్తించి ప్రశ్నించాడు.ఇది గమనించిన స్థానికులు బ్లూ కోల్ట్ పోలీసులకు పార్థసారధి రెడ్డిని అప్పగించారు. వన్‌టౌన్ పోలీసులు పార్థసారధి రెడ్డి తల్లిని, బాబాయ్‌ని స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పార్థసారధి రెడ్డిని అప్పగించారు.

అసాంఘిక శక్తులు చొరబడివుంటే...?

ముక్కంటి ఆలయంలో భద్రతా వ్యవస్థపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి.నిజానికి ముక్కంటి ఆలయానికి భారీ భద్రతా వ్యవస్థ ఉంది.260మంది సెక్యూరిటీ గార్డులు,32మంది హోంగార్డులే కాక 17మందితో కూడిన ఎస్పీఎఫ్ బలగాలున్నాయి. వీరందరినీ పర్యవేక్షించేందుకు ఉన్నతాధికారులు కూడా వున్నారు.అయినప్పటికీ ఒక బాలుడు అర్ధరాత్రి ఆలయంలోకి ప్రవేశించడమే కాకుండా... ఎవరి కంటా పడకుండా వెలుపలికి రావడం గమనార్హం.పార్థసారధి రెడ్డి స్థానంలో అసాంఘిక శక్తులు ఆలయంలోకి చొరబడి ఉంటే పరిస్థితి ఏంటనేది ప్రశ్న.ఒకవైపు సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయి. మరోవైపు మహాశివరాత్రి ఉత్సవాలు 20 రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఇంతటి కీలక సమయంలో ఇలాంటి ఘటన వెలుగు చూడడం భద్రతావ్యవస్థకు అవమానకరంగా మారింది.రెండు నెలల నుంచి కొందరు అధికారులు అత్యుత్సాహంతో ఎస్పీఎఫ్ బలగాలకు మహాద్వారం వద్ద రిజిస్టర్ నమోదు చేసే విధులను అప్పగించారు.దీంతో భద్రతా సిబ్బంది రిజిస్టర్లు చేతబట్టి వచ్చిపోయే ప్రముఖుల పేర్లు రాసుకోవడంపై దృష్టి పెట్టి అసలు విధులను గాలికొదిలేశారన్న విమర్శలు విన్పిస్తున్నాయి.

ఆలయంలో నిద్రపోయాడట!

ముక్కంటి ఆలయంలోకి బాలుడు పార్థసారధి రెడ్డి చొరబడలేదని... తెరిచి ఉన్న సమయంలోనే లోపలకు వచ్చి నిద్రపోయాడని అధికారులు శుక్రవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు.ఆలయం మూత వేసిన సమయంలో ఎక్కడో నిద్రపోయాడని... ఆ తరువాత అనుమానాస్పదంగా సంచరిస్తున్న బాలుడిని ఎస్పీఎఫ్ పోలీసులు గుర్తించారని తెలిపారు.ఆదమరిచి ఆలయంలో నిద్రపోయినట్లు ఆలయ డిప్యూటీ ఈవో వెంకటసుబ్బయ్య వివరణ ఇచ్చారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని ఒకటవ పట్టణ పోలీసులు పేర్కొన్నారు.అయితే ఎస్పీఎఫ్ పోలీసులు బాలుడిని అదుపులోకి తీసుకుని ఉంటే ఆధారాలు ఎందుకు బహిర్గతం చేయలేదనేది ప్రశ్న. బాలుడు నిద్రపోయి ఉంటే ఆలయంలో అడుగడుగునా ఉన్న సీసీ కెమెరా ఫుటేజ్‌లను ఎందుకు వెల్లడించలేదు? అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించే సమయంలో ఒక ఫొటో కూడా ఎందుకు తీసుకోలేదు? స్థానికులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లిన తర్వాతే ఆలయ యంత్రాంగం మేలుకున్నట్లు స్పష్టంగా తెలుస్తోందని చెబుతున్నారు.

తిరుమలలో ధార్మిక సదస్సుకు ఏర్పాట్లు పూర్తి

తిరుమల, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): తిరుమల ఆస్థానమండపంలో శనివారం నుంచి మూడురోజుల పాటు జరగనున్న సనాతన ధార్మిక సదస్సుకు టీటీడీ ఏర్పాట్లు పూర్తి చేసింది.హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సదస్సులో 59మంది పీఠాధిపతులు, మఠాధిపతులు, ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు.మరికొంతమంది వర్చువల్‌గా సదస్సులో పాల్గొని ధార్మిక అంశాలపై చర్చిస్తారు.సదస్సు ఏర్పాట్లను శుక్రవారం అధికారులతో కలిసి టీటీడీ ఛైర్మన్ కరుణాకర రెడ్డి, ఈవో ధర్మారెడ్డి పరిశీలించారు.శనివారం ఉదయం వేదస్వస్తి, టీటీడీ నిర్వహించిన ధార్మికకార్యక్రమాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్, పీఠాధిపతుల అనుగ్రహ భాషణం ఉంటాయి. మధ్యాహ్నం ప్రాథమిక గోష్ఠి, ద్వితీయ గోష్ఠి కార్యక్రమాలు జరుగుతాయి.

రేషన్ కోసం ఒక వేలిముద్ర చాలు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి2: రేషన్ పొందే కార్డుదారులు శనివారం నుంచి బయోమెట్రిక్ విధానంలో ఒకసారి వేలిముద్ర వేస్తేచాలని జేసీ శ్రీనివాసులు తెలిపారు.శుక్రవారం రాత్రి జరిగిన వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఆయన అధికారులతో మాట్లాడారు.ఎండీయూ వాహనాల ద్వారా ఉచితంగా, నగదుతో పొందే నిత్యావసర వస్తువుల కోసం ఇకపై ఒక్కసారి మాత్రమే వేలిముద్ర వేయాలని, రెండో వేలిముద్ర కోసం ఒత్తిడి చేయొద్దన్నారు.

సప్తగిరి గ్రామీణ బ్యాంకు
(ప్రభుత్వ రంగ సంస్థ :: ఇండియన్ బ్యాంక్‌చే ప్రాయోజితం)
ఎం.ఆర్.పల్లి శాఖ, తిరుపతి, తిరుపతి జిల్లా

అనుబంధం -4ఎ (రూల్8(6) యొక్క అంశాలు చూడండి)

స్థిరాస్తుల అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్,2002 రూల్ 8(6) నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం,2002 ప్రకారం స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి ముఖ్యముగా రుణగ్రహీతలు/ హామీదారులకు, తెలియజేయడమేమనగా ఈ క్రింద తెలిపిన స్థిరాస్తి బ్యాంకు వారి తనఖాలో వుండి సప్తగిరి గ్రామీణ బ్యాంక్, ఎం.ఆర్.పల్లి శాఖ యొక్క అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకుని ఉన్నారు. బ్యాంకు వారు దిగువ తెలిపిన ఋణమును రాబట్టుకొనుటకు ఆస్తిని "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే " "ఎక్కడ ఏమి వున్నది అక్కడ అలానే" ప్రాతిపదికన వేలము ద్వారా తేది: 04.03.2024 న విక్రయించుటకు నిర్ణయించడమైనది.

రుణగ్రహీత / తనఖాదారు: శ్రీ కె.జనార్ధన్ తండ్రి కె.పోలయ్య, 2-28, గొల్లపల్లి, పల్లం, తిరుపతి జిల్లా - 517620

మరియు గ్యారంటారు: శ్రీ టి.సుధాకర్‌రెడ్డి తండ్రి టి.గోపాల్‌రెడ్డి 1-10, కాపు వీధి, మన్నసముద్రం, మేర్లపాక, తిరుపతి జిల్లా - 517619

రిఫరెన్స్: ఎల్‌పిఎంపి 50019192520

తేది: 31.01.2024 నాటికి బకాయి మొత్తం రూ.6,85,945/- (అక్షరాలా ఆరు లక్షల ఎనభై ఐదు వేల తొమ్మిది వందల నలభై ఐదు రూపాయలు మాత్రమే) మరియు తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు ఇతర వ్యయాలతో సహా.

డిమాండ్ నోటీసు తేది: 28.10.2022 స్వాధీనతా తేది: 16.08.2023

స్థిరాస్తి వివరములు

తిరుపతి జిల్లా, శ్రీ బాలాజి రిజిస్ట్రేషన్ జిల్లా, శ్రీకాళహస్తి సబ్ జిల్లా, శ్రీకాళహస్తి మండలం, వాగవేడు గ్రామలెక్కదాఖలా, డిటిసిపి గుంటూరు (అమరావతి) ద్వారా ఎల్.పి.నెం .58/2017/ఎ, తేది: 28.04.2017గా ఫైనల్ అప్రూవల్ పొంది సర్వేనెం.46/5లో ఎ.0.16లో వేసిన శ్రీ శ్రీనివాసగార్డెన్స్-2 లేఅవుట్ నందు

ఐటంనెం.1: ప్లాటు నెం.5, స్థలం విస్తీర్ణం 2454.37 చ.అ. లేదా 272.70చ.గ. హద్దులు: తూర్పు: ఇతరుల భూమి, పడమర: 33అ. వెడల్పు గల లేఅవుట్ రోడ్డు, ఉత్తరం: ప్లాటు నెం.4 స్థలం, దక్షిణం: ప్లాటు నెం.6 స్థలం,

ఐటంనెం.2: ప్లాటు నెం.6, స్థలం విస్తీర్ణం 2433.75 చ.అ. లేదా 270.41చ.గ. హద్దులు: తూర్పు: ఇతరుల భూమి, పడమర: 33అ. వెడల్పు గల లేఅవుట్ రోడ్డు, ఉత్తరం: ప్లాటు నెం.5 స్థలం, దక్షిణం: ప్లాటు నెం.7 స్థలం.

తనఖాదారు పేరు వివరములు	: కె.జనార్ధన్ తండ్రి కె.పోలయ్య, 2-28, గొల్లపల్లి, పల్లం, తిరుపతి జిల్లా - 517620
రిజర్వు ధర	: రూ.16.29 లక్షలు
ధరావత్తు	: రూ.1.63 లక్షలు
మునుపటి బకాయిలు	: లేవు

విక్రయం / వేలం తేది, సమయం & స్థలం: 04.03.2024 , మ.2.00 గం॥లకు సప్తగిరి గ్రామీణ బ్యాంకు, ఎం.ఆర్.పల్లి శాఖ, తిరుపతి

బిడ్/ టెండరు సమర్పణకు ఆఖరు తేది & సమయం: తేది: 04.03.2024 & 2.00గం॥ల లోపు సప్తగిరి గ్రామీణ బ్యాంకు, ఎం.ఆర్.పల్లి శాఖ, తిరుపతి వద్ద

టెండరు ఫారములు దొరకు స్థలము:
1) బ్రాంచ్ మేనేజర్, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, ఎం.ఆర్.పల్లి శాఖ, తిరుపతి.
2) ఎజిఎం/ చీఫ్ మేనేజర్, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, హెడ్ ఆఫీస్, చిత్తూరు
3) అధీకృత అధికారి, ప్రాంతీయ కార్యాలయము, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, తిరుపతి

మరిన్ని వివరముల కొరకు బిడ్డరు బ్యాంకు యొక్క వెబ్‌సైట్ www.saptagirigrameenabank.in నందు లేదా బ్రాంచ్ మేనేజర్, ఎం.ఆర్.పల్లి శాఖ, తిరుపతి, సెల్:8886644055ను సంప్రదించగలరు.

తేది: 31.01.2024, ప్రదేశం:తిరుపతి — సం॥ అధీకృత అధికారి, సప్తగిరి గ్రామీణ బ్యాంక్

వరిపంటకు తెగుళ్లు


తెగుళ్ల సోకిన వరిపైరు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 2: వరి పంటలో పురుగులు, తెగుళ్ల విజృంభించాయి. ఎన్నిసార్లు పురుగు మందులు పిచికారి చేసినా చీడపీడల ఉధృతి తగ్గడం లేదని రైతులు వాపోతున్నారు.మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో పొట్టదశలో ఉన్న వరి పంటలకు బాగా నష్టం వాటిల్లింది. మిగిలిన అరకొర పంటను కాపాడుకుందామను కొన్న అన్నదాతల ఆశలను చీడపీడలు ఆవిరి చేస్తున్నాయి. పంట చేతికొచ్చే సమయంలో తెగుళ్ల బారిన పడడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో దాదాపు 15 వేల హెక్టార్లకు పైగా వరిపంటను సాగుచేస్తున్నారు. తుఫాన్, మంచు తాకిడిని అధిగమించి సాగుచేసుకొన్న వరి పంట మరో రెండు వారాల్లో చేతికొస్తుందనగా తెగుళ్ల సోకడంతో అన్నదాతలు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. నాలుగు నెలల పాటు పంట సంరక్షణ చేసుకొని గింజలు గట్టిపడుతున్న సమయంలో కంకులు తెల్లగా మారిపోతున్నాయంటున్నారు.వాతావరణ మార్పులతో కాండం తొలిచే పురుగులు వ్యాపించి గింజలు గట్టిపడటం లేదు. దీంతో దిగుబడి బాగా తగ్గిపోయే పరిస్థితి ఏర్పడింది. సూళ్లూరుపేట మండల పరిధిలోని కుదిరి, చెరువుకండ్రిగ, నాదెండ్లవారి కండ్రిగ, పడమటి కండ్రిగ, మంగళంపాడు, మంగానెల్లూరు గ్రామాల్లో పొట్ట దశలో, ఎన్ను దశలో ఉన్న వరి పంట కంకులు బయటకొచ్చి గింజలు గట్టిపడే దశలో ఉన్నాయి. ఈ సమయంలో పంటకు దోమపోటు, మెడవిరుపు తెగుళ్లతో పాటు కాండం తొలిచే పురుగు వ్యాప్తి చెంది కంకి మొదలు నుంచి రసాన్ని పీల్చివేస్తుండడంతో కంకులు జీవం కోల్పోయి తెల్లగా మారిపోతున్నాయి. రైతులు పొలాల్లో పంటను చూసుకొని ఎరువుల దుకాణాల వద్దకు, వ్యవసాయ అధికారుల వద్దకు పరుగులు తీస్తున్నారు. వారు చెప్పే మందులను పిచికారి చేసినా ఆశించిన ఫలితాలు రాలేదని చెబుతున్నారు.


రసం పీల్చేయడంతో తెల్లగా మారిన వరి కంకులు

సూళ్లూరుపేట వైసీపీలో

శృతి మించిన అసమ్మతిరాగం

అవినీతిపరుడైన సంజీవయ్య వద్దు..
జగనన్న ముద్దు.. అంటూ కరపత్రాల ప్రచారం



ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ముద్రించి చల్లిన కరపత్రాలు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 2: సూళ్లూరుపేట వైసీపీలో వర్గ విభేధాలు తారాస్థాయికి చేరాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే కలివేటి సంజీవయ్య ఈ దపా టికెట్ ఇవ్వకూడదంటూ ఆయన వ్యతిరేక వర్గం అసమ్మతి తెలియజేస్తున్న విషయం తెలిసిందే. అవినీతికి పాల్పడ ఈ ఎమ్మెల్యే సంజీవయ్య మాకొద్దు.. జగన్ ముద్దు అని కరపత్రాలు ముద్రించిన గురువారం రాత్రి పట్టణమంతా చల్లడం అధికార పార్టీలో కలకలం రేపింది. శుక్రవారం ఉదయం పట్టణ వీధుల్లో కరపత్రాలు కనిపించడంతో ఎమ్మెల్యే వర్గం ఉలిక్కి పడింది. ఏడాది కాలంగా ఎమ్మెల్యే సంజీవయ్యకు వ్యతిరేకంగా నియోజకవర్గంలో అన్ని మండలాల్లో ఆయన వ్యతిరేక వర్గం నాయకులు అసమ్మతి తెలియజేస్తున్నారు. అధిష్టానానికి సైతం తీసుకెళ్లి తమ గళాన్ని వినిపించారు. రెండుసార్లు అసమ్మతి నేతలందరూ సమావేశమై సంజీవయ్యకు టికెట్ ఇస్తే తాము పనిచేయమని తేల్చి చెప్పారు. ఆయన ఇసుక, గ్రావెల్ మాఫియాకు పాల్పడి కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడ్డారని బహిరంగంగా ఆరోపించారు. జనవరి 21న నాయుడుపేటలో జరిగిన సామాజిక బస్సుయాత్రలో ఆ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ ఎంపీ విజయసాయి రెడ్డి వచ్చే ఎన్నికల్లో కిలివేటి సంజీవయ్యే వైసీపీ అభ్యర్థి అని అధికారికంగా ప్రకటించారు. అప్పటి నుంచి అసమ్మతివర్గం తీవ్ర ఆగ్రహంతో ఉంది. అయితే పార్టీ కార్యాలయం నుంచి ఇంకా స్పష్టత రాకపోవడంతో ఎమ్మెల్యే అభ్యర్థి విషయంలో అనిశ్చితి నెలకొంది. ఈ తరుణంలో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఆయన అవినీతికి పాల్పడ్డారు... సంజీవయ్య వద్దు.. జగనన్న ముద్దు అంటూ గుర్తుతెలియని వ్యక్తులు కరపత్రాలు ముద్రించి పట్టణమంతా వీధుల్లో చల్లడం చర్చనీయాంశమైంది. ఇదంతా అసమ్మతి నేతల పనేనని ఎమ్మెల్యే అనుకూల వర్గం అనుమానిస్తోంది. కాగా, ఎన్నికల సమీపిస్తున్న పార్టీలో వర్గవిభేదాలు తారాస్థాయికి చేరడం పట్ల పలువురు నాయకులు ఆందోళన చెందుతున్నారు.

టీడీపీతోనే మహిళా సాధికారత


కరపత్రాలను అందజేస్తున్న సంధ్యారాణి

గూడూరు, ఫిబ్రవరి 2: టీడీపీతోనే టీడీపీతోనే సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం స్థానిక బనిగీసాహెబ్‌పేటలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబునాయుడు మహిళ అభ్యున్నతి కోసం అనే సంక్షేమ పథకాలను అమలు పరిచారన్నారు. డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ఆయన ఎంతో కృషిచేశారన్నారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహాశక్తి పథకం ద్వారా మహిళలకు అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు పరుస్తామని చంద్రబాబునాయుడు మినీమేనిఫెస్టోను రూపొందించారన్నారు. మహిళలందరూ టీడీపీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, వాటంబేడు శివకుమార్, కోటేశ్వరరావు, జనార్థన్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, అల్లీహుస్సేన్, నూర్జహాన్, సుబ్బమ్మ, భారతి, గుండాల లీలావతి, కల్పన, శ్రీదేవి పాల్గొన్నారు.

టీడీపీలోనే బీసీలకు సముచితస్థానం


సదస్సులో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 2: టీడీపీలోనే బీసీలకు సముచితస్థానం లభిస్తుందని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని ఏబీఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జయహో బీసీ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్గీయ ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించి బలహీన వర్గాలకు రాజకీయంగా పెద్దపీట వేయడం జరిగిందన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషిచేశారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం బీసీల సంక్షేమం గురించి పట్టించుకోకపోగా, తగిన గుర్తింపు కూడా ఇవ్వడంలేదని, పైగా దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాని విమర్శించారు. అంతకుముందు ఎన్టీఆర్, జ్యోతిరావు పూలే దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కందల కృష్ణారెడ్డి నాయకులు శ్రీరామ్ ప్రసాద్, అత్తికాయల సుబ్రహ్మణ్యం, చిరువేళ ప్రకాశం, గుంటూరు లక్ష్మయ్య, బీసీ సంఘ నాయకులు సదాశివం, ధనంజయ, మస్తాన్, కాశీ, ఇమిడిశెట్టి వెంకటేశ్వర్లు, రహమాన్, వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలో అసెంబ్లీని విజయవంతం చేయండి

పెళ్లకూరు, ఫిబ్రవరి 2: రాష్ట్ర సర్పంచుల సంఘం, పంచాయతీరాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో ఈనెల 6న విజయవాడలో నిర్వహించే చలో అసెంబ్లీ కార్యక్రమానికి సర్పంచుల తరలిరావాలని ఉమ్మడి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, పంచాయతీరాజ్ రాష్ట్ర కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి శుక్రవారం కోరారు.

ప్రకటన

తేది:01-02-2024

సెయింట్ పాల్ పీటర్స్ లూథరన్ చర్చి, గూడూరు.
సంఘం ఛైర్మేన్ గారు కె.రాజయ్య

ముఖ్య అంశం: సెయింట్ పాల్ పీటర్స్ లూథరన్ చర్చి నందు నవంబర్ నెల 2023వ సంవత్సరం, సర్వసభ్య సమావేశం మరియు క్రొత్త కౌన్సిల్ మరియు ఆర్థిక లెక్కలు పై వివరణ జరగలేదు. **సంఘం ఛైర్మన్ కె.రాజయ్య గారు సంఘ సెక్రటరీని కె.ఉదయ్‌భాస్కర్‌ని** కౌన్సిల్ సమావేశం జరపమని అడుగగా ఈ విధంగా వివరణ ఇచ్చారు. సంఘ సెక్రటరీ గారు, **ట్రెజరర్‌గా ఎమ్.నిర్మలమ్మ, వైస్ ఛైర్మన్ పి.నిరంజన్‌కుమార్ (చిన్న)గారు** సంఘ కాపరి, చెపితేనే నేను మీటింగ్‌కి సర్క్యులర్ రాస్తాను అన్నారు. గత 1 1/2 సంవత్సరం నుండి కూడా కౌన్సిల్ ఆమోదం సంఘాన్ని నడుపుతున్నారు. కౌన్సిల్ ఆమోదం లేకుండా ట్రెజరర్ గారు ఓటరులిస్టు చదివినారు. సెక్రటరీ గారు కౌన్సిల్ మీటింగ్ లేకుండా జనరల్‌బాడీని చదవడం, ఓటర్ లిస్టు చదవడం, **SALC** ప్రకారం చెల్లుబాటు కాదు. వీరు సంఘాన్ని అవకతవకలు చేసినారు. ఛైర్మన్, కౌన్సిల్ నంబర్స్ లావాదేవీలు అడిగితే సంఘంలో వివాదాలు ఏర్పడ్డాయి. మేము సమాధానం కొరకు 4 వారాలు వేచి చూచిన ఎటువంటి సమాధానం లేదు. చర్చి రూల్స్ ప్రకారం క్రొత్త కౌన్సిల్‌ను ఏర్పాటు చేసి సంఘం సమాధానం ఉండుటకు నేను సంఘ ఛైర్మన్‌గా బాధ్యత వహిస్తూ **తేది:04-02-2024 ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు సర్వసభ్య సమావేశం జరుగునని సంఘానికి తెలియపరుస్తున్నాను.** కాబట్టి ప్రతి యొక్క సంఘ సభ్యులు తప్పక రావాలని కోరుచున్నాను. **సంఘం పోషణ** మరియు సంఘ సభ్యుల సంఖ్య మరియు క్రొత్త కౌన్సిల్ ఏర్పడిన తరువాత సంఘం పోషణ లేని వ్యక్తులకు సంఘ పోషణ కట్టించుకోవడం జరుగుతుంది. సంఘ సభ్యులు అందుకు తప్పకుండా రావాలని ఆశిస్తున్నాము.

కె.రాజయ్య
ఛైర్మన్, సెయింట్ పాల్ పీటర్స్ లూథరన్ చర్చి, గూడూరు

చెరువులో పడి
ఇంటర్ విద్యార్థి మృతి


సంతోష్ (ఫైల్‌ఫోటో)

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 2: మండల పరిధిలోని పెరిమిటిపాడు చెరువులో పడి ఇంటర్ విద్యార్థి ఎ.సంతోష్(17) మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకొంది. సూళ్లూరుపేట పట్టణంలోని వత్రపాలెంలో నివాసం ఉంటున్న ఆర్టీసీ డ్రైవర్ ఆనంద్ కుమారుడు సంతోష్ పట్టణంలో ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం పెరిమిటిపాడు గ్రామంలో ఉన్న తన స్నేహితుడు ఇంటికి వెళ్లాడు. ఇద్దరూ కలిసి గ్రామ పొలిమేర్ల వున్న చెరువు వద్దకెళ్లి స్నానం చేస్తుండగా మృతి చెందాడు.

తాగుబోతుల వీరంగం

గడ్డివామి, బైక్ దగ్ధం

కోట, ఫిబ్రవరి 2: కోట పట్టణంలో శుక్రవారం తెల్లవారు జామున తాగుబోతులు వీరంగం సృష్టించారు. పట్టణంలోని ఒక వ్యక్తికి చెందిన మోటారు బైక్‌ను, స్థానిక దళితవాడలోని ఓ గడ్డివామిని తగలబెట్టారు. బాధితులు ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగబాబు విచారణ చేపట్టారు.

ఉపాధిలో అవినీతిని ఉపేక్షించం: డ్వామా పీడీ

- ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్ల సస్పెన్షన్
- రూ.2,15,825 రికవరీకి ఆదేశం


రికార్డులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్

పెళ్లకూరు, పిబ్రవరి 2: ఉపాధి పనుల కల్పనలో అలసత్వం వహించినా... అవినీతి అక్రమాలకు పాల్పడినా... ఉపేక్షించేది లేదని డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం పెళ్లకూరులో ఎంపీడీవో సురేష్‌బాబు అధ్యక్షతన ఉపాధి పనుల సామాజిక తనిఖీ సభ నిర్వహించారు. మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.10.18 కోట్లతో జరిగిన ఉపాధి పనుల వివరాలు వెల్లడించారు. అవకతవకలకు సంబంధించి ఏపీవో, ఈసీ, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్ల నుంచి రూ.2,15,825 రికవరీకి ఆదేశించారు. ఇందులో రూ.1,18,017 సూచిక బోర్డులు ఏర్పాటు చేయనందుకు, మస్టర్ల తేడాలకు సంబంధించి రూ.97,808 రికవరీ చేయాలని ఆదేశించారు. ఈ మొత్తంలో ఏపీవో నుంచి రూ.23,305, అందరు ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ.19,870, ఒక టెక్నికల్ అసిస్టెంట్ నుంచి 12,615, మిగిలిన నగదు ఇతర సిబ్బంది నుంచి వసూలు చేయాలని నిర్ణయించారు. అదేవిధంగా నిబంధనల ప్రకారం జాబ్ కార్డులు కలిగిన వారికి వంద రోజులు పని దినాలు కల్పించకపోవడం, చేసిన పనుల కొలతల్లో తేడా ఉండడం తదితర అంశాలను గుర్తించారు. చిల్లకూరు పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ రత్నయ్య, పునబాకకు చెందిన టెక్నికల్ అసిస్టెంట్ కృష్ణవేణిలను సస్పెండ్ చేస్తున్నట్లు డ్వామా పీడీ ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారిణి భాగ్యలక్ష్మి, అంబుడ్స్‌మెన్ రాసరాయనాయుడు, ఏపీడీ రవికుమార్‌నాయుడు, ఎస్‌ఆర్పీ నాగరాజు ఎంపీడీవో కె.సురేష్‌బాబు, ఏపీవో దయానందం పాల్గొన్నారు.

వెంకటగిరిలో రూ.62,936 రికవరీ

వెంకటగిరి టౌన్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి పనుల సామాజిక తనిఖీ సభ నిర్వహించారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీల వారీగా జరిగిన పనుల వివరాలను పరిశీలించారు. లక్ష్యాన్ని పూర్తి చేయని టీఏ, ఎఫ్ఏలను తొలగించాలని ఆదేశించారు. రూ.62,936 రికవరీకి ఆదేశించి రూ.9522 జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు పంచాయతీల్లో జాబ్ కార్డులు కూడా పంపిణీ చేయలేదని, సంతకాలు, వేలిముద్రలు లేకుండా బిల్లులు ఎలా ఇస్తారని స్టిబందిపై మండిపడ్డారు. ఇక్కడ ఏపీవోను సస్పెండ్ చేస్తే మండలం బాగుపడుతుందని అన్నారు. రూ.6.49కోట్ల పనులకు రూ.2.28కోట్ల పనిదినాలు కల్పించినట్లు వెల్లడించారు. అవినీతికి పాల్పడిన వారిపై కేసులు పెట్టి రికవరీ చేయిస్తామని స్పష్టం చేశారు. ఉపాధి పథకం కింద డ్రైనేజీ పనులు చేస్తే ఇప్పటి వరకు సిమెంటు డబ్బులు రాలేదని ఎంపీపీ భర్త శివారెడ్డి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన పీఆర్ ఏఈ సిబ్బందిని పిలిపించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంపై ఎస్ఈకి ఫిర్యాదు చేసి తగు న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారిణి భాగ్యలక్ష్మి, అంబుడ్స్‌మన్ రాసారాయ రాయుడు, ఏపీడీ ప్రేమ్ కుమార్, ఎస్‌ఆర్పీ నాగరాజు, ఎంపీడీవో నీలకంఠేశ్వర రెడ్డి, ఏపీవో దీవ, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి నిరోధక పాలనకు స్వస్తి పలకాలి: నెలవల


అశోక్‌కుమార్‌కు మద్దతు పలుకుతున్న నెలవల తదితరులు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 2: రాష్ట్రంలో అరాచక, అభివృద్ధి నిరోధక పాలనకు ప్రజలు స్వస్తి పలకాలని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని ఇచ్ఛాపురం నుంచి తిరుమలకు పాదయాత్ర చేస్తున్న అశోక్‌కుమార్ శుక్రవారం నాయుడుపేటకు చేరుకున్నారు. ఆయనకు నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కందలకృష్ణారెడ్డి స్వాగతం పలికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ జగన్ రూ.12 లక్షల కోట్లు అప్పులు చేశాడేగానీ రాష్ట్రంలో ప్రాజెక్టులను పూర్తి చేయలేదన్నారు. కనీసం రోడ్లను బాగు చేయలేదని విమర్శించారు. పాదయాత్ర చేస్తున్న శివకుమార్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు, మంత్రులు కోట్లాది రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఏ చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అశోక్‌రెడ్డి, శ్రీరామ్ ప్రసాద్, గూడూరు సుధీర్‌రెడ్డి, కృష్ణయ్య, దార్ల రాజేంద్ర, ముత్యాలయ్య, చక్రపాణి, శ్రీనివాసులు, అవధానం సుధీర్, కాశీ, సుగుణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే యువతకు మెరుగైన ఉపాధి


యువతనుద్దేశించి మాట్లాడుతున్న పాశం సునీల్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 2: టీడీపీ ప్రభుత్వంలోనే యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగిందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం మాజీ కౌన్సిలర్ భారతి ఆధ్వర్యంలో యువత టీడీపీలోకి చేరడంతో వారికి మాజీ ఎమ్మెల్యే పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్న సమయంలో రాష్ట్రానికి అనేక పరిశ్రమలను తీసుకువచ్చి యువతకు ఉపాధి కల్పించారని అన్నారు. ఐటీ రంగాన్ని అభివృద్ధి చేయడంతో ఎంతో మంది యువతకు ఉద్యోగాలు లభించాయన్నారు. యువతకు నిరుద్యోగభృతిని అమలు పరిచింది కూడా టీడీపీ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయకుండా, ఉద్యోగాలు కల్పించకుండా నిరుద్యోగ యువతను మోసం చేసిందన్నారు. మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా యువగళం నిధిని ఏర్పాటు చేసి నెలకు రూ. 3వేల చొప్పున నిరుద్యోగభృతిని అందించేలా చంద్రబాబు నాయుడు పథకం రూపొందించారన్నారు. నారా లోకేశ్ చెప్పిన విధంగా టీడీపీ అధికారంలోకి రాగానే యువతకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం మొదటిసారి ఓటుహక్కు పొందిన యువతకు 'నా మొదటి ఓటు సీబీఎన్‌కే' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, ఆరికట్ల మస్తాన్‌నాయుడు, భారతి, సందీప్, వెంకటసాయి, సునీల్, వెంకటేష్, సుబ్రమణ్యం, శివకుమార్, లోకేశ్, మురళి, సాయితేజ, మధుసూదన్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, వెంకటేశ్వర్లురాజు తదితరులు పాల్గొన్నారు.

బాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్


ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

చిట్టమూరు, జనవరి 2: బాబు వస్తేనే.. రాష్ట్ర ప్రజలకు మంచి భవిష్యత్తు ఉంటుందని టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు అన్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలో తీర ప్రాంత గ్రామాలైన బురదగాలి, కొత్తపాళెంలో నిర్వహించారు. చంద్రబాబు ప్రకటించిన మినీమేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎర్రబోతు సుబ్రహ్మణ్యం, నరేష్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, చిన్నారావు, చెంచురామయ్య ఆచారి, విద్యానాయుడు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఊనుగుంటపాళెంలో...


ఊనుగుంటపాళెంవాసులతో టీడీపీ నాయకులు

కోట, ఫిబ్రవరి 2: మండల పరిధిలోని ఊనుగుంటపాళెంలో శుక్రవారం బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. టీడీపీ నాయకులు ఊనుగుంటపాళెం, దళిత, అరుంధతీయ, వడ్డిపాళెం, గిరిజన కాలనీల్లో పర్యటించి కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, పాదర్తి కోటేశ్వరరెడ్డి, నెల్లూరు మోహన్‌రెడ్డి, రఘురామరెడ్డి, మధుయాదవ్, జానా వెంకట కృష్ణయ్య, బాలకృష్ణయాదవ్, జడ వేణు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఐసీటీ సిమిలేషన్స్‌పై ఉపాధ్యాయులకు అవగాహన

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 2: ఐసీటీ సిమిలేషన్స్‌పై గణిత ఉపాధ్యాయులకు డిప్యూటీ డీఈవో శివప్రకాష్‌రెడ్డి అవగాహన కల్పించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నాయుడుపేట, పెళ్లకూరు. చిట్టమూరు, దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ మండలాల ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ డీఈవో శివప్రకాష్‌రెడ్డి గణిత ఉపాధ్యాయులకు పలు సలహాలు, అందజేశారు. ఐసీటీ సిమిలేషన్స్‌ను తరగతి గదుల్లో ప్యానల్స్ ద్వారా వివిధ మాధ్యమాల సాయంతో విద్యార్థులు నేర్చుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో మునిరత్నం, హెచ్‌ఎం సుధాకర్, రిసోర్స్ పర్సన్లు మహ్మద్ షఫీఉల్లా, బాలసుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విజయానికి సమష్టిగా కృషి చేయండి



సభలో మాట్లాడుతున్న ఎస్ఎస్ఆర్ నాయుడు

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 2: వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త ఎస్ఎస్ఆర్ నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ చేస్తున్న అభివృద్ధిని గ్రామస్థాయిలోకి తీసుకెళ్లాని, అపుడే విజయావకాశాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, రాష్ట్ర అధికార ప్రతినిధులు భానుప్రకాష్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్, నాయకులు పార్థసారధి, సొనుగంటి భాస్కర్, బీడీ బాలాజీ, దామ గురుప్రసాద్, గోపీ, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయండి

గూడూరు, ఫిబ్రవరి 2: నియోజకవర్గ పరిధిలో బీజేపీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప అన్నారు. శుక్రవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ పేదప్రజల అభ్యున్నతికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో వివరించాలన్నారు. కార్యక్రమంలో భానుప్రకాష్‌రెడ్డి, శ్రీనివాసులు, పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి, పనబాక కోటేశ్వరరావు, ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, బిందురెడ్డి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖరపురంలో ఆరోగ్య సురక్ష

కోట, ఫిబ్రవరి 2: మండల పరిధిలోని గూడలి పంచాయతీలో గల చంద్రశేఖరపురంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. చిట్టమూరు మండలం గునపాటిపాళెం, కోటలోని 30పడకల ఆస్పత్రి వైద్యాధికారి డోమ్‌ప్రియారావు రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

కోట ఎంపీడీవోగా శంకరయ్య



కోట, ఫిబ్రవరి 2: కోట ఎంపీడీవోగా మంగళం శంకరయ్య బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు జిల్లా బి.కొత్తకోటలో పనిచేస్తున్న ఆయన బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న మారేళ్ల భవానీ చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు.

చిల్లకూరు ఎంపీడీవోగా భానుమూర్తిరావు



చిల్లకూరు, ఫిబ్రవరి 2: చిల్లకూరు ఎంపీడీవోగా భానుమూర్తిరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. వడమాలపేటలో పనిచేస్తున్న ఆయన చిల్లకూరుకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకటసాయిసూర్య చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు.

నాయుడుపేట ఎంపీడీవోగా ప్రేమ్‌రాజ్‌కుమార్

నాయుడుపేట, ఫిబ్రవరి 2: నాయుడుపేట ఎంపీడీవోగా ప్రేమ్‌రాజ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు జిల్లా వెదురుకుప్పంలో పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు.

చిట్టమూరు ఎస్ఐగా చిన్న బలరామయ్య

చిట్టమూరు, ఫిబ్రవరి 2: చిట్టమూరు ఎస్ఐగా చిన్న బలరామయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుమలలో పనిచేస్తున్న ఆయన బదిలీపై చిట్టమూరుకు వచ్చారు. ఇక్కడ ఎస్ఐలుగా పనిచేస్తున్న గోపి నాయుడుపేటకు, లక్ష్మీభవాని తిరుపతికి బదిలీ అయ్యారు.

సూళ్లూరుపేట ఎస్ఐగా రహీం రెడ్డి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 2: సూళ్లూరుపేట ఎస్ఐగా రహీం రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

విద్యుత్‌శాఖ ఈఈగా నరేంద్రరెడ్డి

గూడూరు, ఫిబ్రవరి 2: విద్యుత్‌శాఖ ఈఈగా నరేంద్రరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఈఈగా పనిచేస్తున్న ఇస్మాయిల్‌అహ్మద్ ఎస్ఈగా పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అనంతపురం జిల్లా నుంచి బదిలీపై వచ్చిన నరేంద్రరెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

రీసర్వే భూముల పరిశీలన

కోట, ఫిబ్రవరి 2: మండల పరిధిలోని తిన్నెలపూడి, లక్ష్మక్కకండ్రిగ, చెంబడిపాళెం గ్రామాల్లో శుక్రవారం జిల్లా సర్వేయర్ జయరాజ్ రీసర్వే భూములను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో భూముల హద్దుల్లో నాటిన సర్వే రాళ్లను తనిఖీ చేసి సచివాలయ సర్వేయర్లకు సూచనలిచ్చారు.

పాఠశాలల్లో తనిఖీలు

కోట, ఫిబ్రవరి 2: మండల పరిధిలోని మద్దాలి, మద్దాలి కండ్రిగ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ఎంఈవో మస్తానయ్య తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. మధ్యాహ్న భోజనం వంటకాలను రుచిచూశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ

కోట, ఫిబ్రవరి 2: మండల పరిధిలోని తిమ్మానాయుడుపాళెంలో 400 సంవత్సరాల చరిత్ర కలిగిన భ్రమరాంబ సమేత సంత కాళహస్తీశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ ఆలయాన్ని చెన్నైకు చెందిన భక్తులు భాగస్వామ్యంతో పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందుకు దేవదాయశాఖ నిధులు రూ.96 లక్షలు, భక్తుల దాతృత్వంతో రూ.26 లక్షలు ఖర్చుచేయనున్నారు. శుక్రవారం దేవదాయశాఖ అధికారులు, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ హోమాలు, పూజలు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ రమేష్‌కుమార్, దేవదాయశాఖ డీఈ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాదుస్తుల అందజేత

గూడూరు, ఫిబ్రవరి 2: మండలంలోని విందూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడాదుస్తులు, క్రీడాసామగ్రిని అందజేశారు. క్లబ్ జిల్లా గవర్నరు నాగేశ్వరరావు, ఛైర్మన్ రియాజ్ అహ్మద్, శివయ్య, వీరేంద్రనాథ్, గురునాథం, చెంచురామయ్య, మురళీరెడ్డి, రూపేష్‌రెడ్డి, రవీంద్రకుమార్, రమణయ్య పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

గూడూరు, ఫిబ్రవరి 2: స్థానిక బాలాజీనగర్‌లోని ప్రగతి సేవాసంస్థ కార్యాలయంలో శుక్రవారం కడివేటి చంద్రశేఖర్, లక్ష్మీదేవి దాతృత్వంతో పేదలకు దుస్తులను, ఆహారపొట్లాలను పంపిణీ చేశారు. పూర్ణచంద్రరావు, శ్రీనివాసులు, చంద్రశేఖర్, ప్రభాకర్, రాము, సతీష్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


జడ్జి మురళీధర్‌ను సన్మానిస్తున్న ప్రకృతి కుమార్

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 2: ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన పెంచుకోవాలని గూడూరు సీనియర్ సివిల్ జడ్జి మురళీధర్ అన్నారు. శుక్రవారం స్థానిక మదర్ అకాడమీ పాఠశాలల్లో స్వామి వివేకానంద యువసైన్యం ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం జడ్జి మురళీధర్‌ను ఏపీపీ ప్రకృతి కుమార్, పాఠశాల సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వర్లు, ఎస్ఐ నరసింహారావు, ఐటీఐ ట్రైనింగ్ అధికారి రామారావు, కరస్పాండెంట్ పవన్ సాయి, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ పాలనకు చరమగీతం పాడాలి: జనసేన


కరపత్రాలను అందజేస్తున్న జనసేన నేతలు

చిల్లకూరు, ఫిబ్రవరి 2: రాష్ట్రంలో అరాచకపాలన సాగిస్తున్న వైసీపీ పాలనకు చరమగీతం పాడాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని పునుగుంట పాళెం గ్రామంలో జనసేన ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి జనసేన పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రానున్న ఎన్నికలలో రాష్ట్రాభివృద్ధి కాంక్షించే జనసేన - టీడీపీ ఉమ్మడి ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంద్రవర్ధన్, మహేష్, ఉనీల్, హరికృష్ణ, సాయి, శివ, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎలుకల నివారణపై అవగాహన

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 2: పంటలు సాగుచేసే రైతులు ఎలుకల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయశాఖ అధికారి గణేష్ సూచించారు. శుక్రవారం మండలంలోని అన్నమేడులో రైతులకు సామూహిక ఎలుకల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఏఈవో పుట్టయ్య, సిబ్బంది ఆదినారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్: మండల పరిధిలోని యాతలూరులో జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకుడు డాక్టర్ ధనంజయరెడ్డి, ఏడీఏ నాగర్జున సాగర్ ఎలకల నివారణపై అవగాహన కల్పించారు. 6కిలోల నూకలకు 125గ్రాముల బ్రోమోడయోలిన్ కలిపి విషపు ఎరను తయారు చేసుకోవాలని, దానిని 10గ్రాముల ప్యాకెట్లుగా చేసి ఎలుకల బొరియల్లో పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో సుజాత, ఏఈవోలు రామ్మోహన్, గోపీ కృష్ణ, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం

వాకాడు, ఫిబ్రవరి 2: మండలంలోని తూపిలి గ్రామంలో విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం శుక్రవారం ఏర్పాటు చేశారు. ఫౌండేషన్ గూడూరు కన్వీనర్ ఆనం నవీన్ ఆధ్వర్యంలో వాకాడు నుంచి తూపిలి గ్రామానికి బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నోవా బ్లడ్‌బ్యాంక్‌చే రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. 200 మంది పైగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో ఛైర్మన్ కొడవలూరు భక్తవత్సల్ రెడ్డి, తూపిలి సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ వాకాటి జనార్దనరెడ్డి పాల్గొన్నారు.

